
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



స్త్రీశక్తి.. సూపర్



● బస్సు నడపండి..

స్త్రీశక్తికి శ్రీకారం చుట్టిన నెల రోజుల వ్యవధిలో డిపోల వారీ గా తమ ప్రాంతానికి బస్సు నడపాలనే డిమాండ్లు అధికమవు తున్నాయి. నేతలతో పాటు ప్రజల నుంచి కూడా ఆర్టీసీ అధికారులకు వస్తోన్న అర్జీలన్నీ కూడా పల్లె ప్రాంతాలవే కావడం గ్రామీణులకు స్త్రీశక్తి పథకం ఏ స్థాయిలో ఉప యోగడ పడుతుందో అద్దం పడుతోంది. పథ కానికి వస్తున్న ఆదరణతో పాటు ప్రయాణికుల నుంచి వస్తున్న వినతులను పరిగణ నలోకి తీసు కున్న అధికారు లు అదనపు బస్సుల ప్రతి పాదనలపై ఇప్పటికే ప్రభు త్వానికి నివేదికలు పంపుతున్నారు.

ఆర్థిక భరోసా కలిగేలా.. మహిళ ల్లో సాధికారిత పెంపొందేలా.. ప్రయాణ భారం నుంచి ఉపశ మనం పొందేలా.. అన్ని వర్గాల మహిళలకు దన్నుగా.. ప్రవేశపెట్టిన 'స్త్రీశక్తి' విజయవంతంగా సాగు తోంది. ఆర్టీసీ బస్సుల్లో మహిళ లకు ఉచిత ప్రయాణంపై గత ఎన్ని కల్లో హామీ ఇచ్చినట్లుగా ముఖ్య మంత్రి చంద్రబాబు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'స్త్రీశక్తి' పథకాన్ని ప్రారంభించారు. ఎంతో ఉత్సుకతతో ఎదురుచూస్తున్న మహిళలు 'స్త్రీశక్తి' ప్రారంభంతో సంబరాలు చేసుకున్నారు. సూపర్ సిక్స్‌లో స్త్రీ శక్తి పథకానికి మహి ళలు నీరాజనాలు పలుకుతున్నారు. పథకం ప్రారంభం నుంచి రోజు రోజుకు మహిళలు, విద్యార్థి నుల నుంచి ఆదరణ లభిస్తోంది. దీంతో జిల్లాలోని అన్ని డిపోల పరిధిలో పథకాన్ని ఆర్టీసీ అధికారులు విజయవంతంగా అమలు చేస్తు న్నారు. ఉచిత ప్రయాణంలో ఎటువంటి అవాం తరాలు ఎదురు కాకుండా అధికారులు ఎప్పటి కప్పుడు చర్యలు తీసుకుంటు న్నారు. దీంతో గత నెల రోజులుగా ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణి కుల ఆక్యుపెన్సీ గణనీయంగా పెరిగింది. ఈ నెల రోజుల వ్యవధి లో ప్రధానంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న పల్లె వెలుగు బస్సుల్లో అంచనాలకు మించి మహిళలు ప్రయాణిస్తున్నారు. ఈ పథకం తో ఉచితంగా బస్సుల్లో ప్రయాణి స్తున్న మహి ళల మోము లో ఆనందం వెల్లివి రు స్తోంది. అన్ని వర్గాల మహిళ లకు స్త్రీశక్తి పథ కం దన్నుగా నిలుస్తోంది.

పథకం ప్రారంభించి నెల రోజురోజుకు పెరుగుతోన్న ఆదరణ

- ఉచిత ప్రయాణంతో మహిళల్లో ఆనందం
- చిరుద్యోగులకు నెలకు రూ.3 వేల వరకు ఆదా
- ఆర్టీసీ బస్సుల్లో గణనీయంగా పెరిగిన ఆక్యుపెన్సీ

5 డిపోలు.. 26.64 లక్షల జీరో టికెట్లు

స్త్రీశక్తి పథకానికి సంబంధించి జిల్లాలో రికార్డు స్థాయిలో జీరో ఫేర్ టిక్కెట్లు జారీ చేసినట్లు అధికారుల గణాంకాలు తెలియజేస్తున్నాయి. గుంటూరు-1, గుంటూరు 2, తెనాలి, మంగళగిరి, పొన్నూరు డిపోల పరిధిలో 30 రోజుల్లో 26 లక్షల 64 వేల 14 మంది మహిళలు ఉచిత ప్రయాణం చేశారు. ఈ మేరకు వారికి జీరో ఫేర్ టిక్కెట్లు జారీ చేశారు. ఇందులో గుంటూరు-1 డిపోలో అత్యధికంగా పల్లెవెలుగు సర్వీసుల ద్వారా మహిళలు జీరో టిక్కెట్లు పొందినట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. గతంలో జిల్లా పరిధిలోని బస్సుల్లో లక్షా 20 వేల మంది మహిళలు రాకపోకలు సాగించారు. ప్రస్తుతం స్త్రీశక్తి పథకం అమల్లోకి వచ్చిన ప్పటి నుంచి నిత్యం లక్షా 40 వేల మంది మహిళలు గమ్యస్థా నాలకు చేరుతున్న ట్లు అధికారులు చెప్పారు.

డిపో	జీరో టిక్కెట్లు
గుంటూరు- 1	7,85,890
గుంటూరు-2	5,49,058
తెనాలి	6,56,884
మంగళగిరి	3,44,736
పొన్నూరు	3,27,446



గుంటూరులో బస్కెక్కిన మహిళలు



బస్సుల కోసం వేచి ఉన్న మహిళలు

గుంటూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా అమలు చేసిన స్త్రీ శక్తి పథకం జిల్లావ్యాప్తంగా సూపర్ సక్సెస్ అయింది. ఈ పథకాన్ని స్వాతంత్ర్య దినోత్సవం రోజైన ఆగస్టు 15న ప్రారంభించగా శనివారంతో 30 రోజులు పూర్తి చేసుకుంది. సోమవారంతో పథకానికి శ్రీకారం చుట్టి నెల రోజులు అవుతుంది. ఆర్టీసీ బస్సులో రోజువారీ ప్రయాణికుల సంఖ్యలో పెరుగుదల తో స్త్రీశక్తి పథకం సూపర్‌హిట్ దిశగా వెళుతుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమ వుతోంది. నారీమణుల నుంచి స్త్రీశక్తి అత్యంత (మిగతా 6వ పేజీలో)

ఆర్థిక వెసులుబాటు

ఈ పథకం సద్వినియోగం చేసుకుం టున్న వారిలో రోజువారీ కూలి పనులకు వెళ్లే నిరు పేదలతో పాటు పట్టణాల్లో కూరలు, పండ్లు తదితరాలు విక్రయించు కునే చిరువ్యాపారులు ఎక్కు వగా కనిపిస్తున్నారు. రోజువారీ ఉపాధి కోసం పట్టణాలకు వెళ్లే మహిళలకు ఉచిత ప్రయాణం మరింత గా ఆర్థిక వెసులుబాటు అందిస్తోంది. దీంతో వీ రందరూ ఉచిత ప్రయాణం ద్వారా నెలకి రూ.2,500 నుంచి రూ.3,000 వరకు టిక్కెట్ల వ్యయం మిగులుతోంది. విద్యా ర్థినులు నెలవారీ బస్సు పాసులు కొనుగోలు చేసి ప్రయాణించేవారు. వీరికి ఈ ఉచిత ప్రయాణం కలిసివచ్చింది.

రౌడీయిజం.. డ్రగ్స్‌పై ఉక్కుపాదం

- మహిళలపై జరిగే నేరాలపైనా దృష్టి
- ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటా
- బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ వకుల్‌జిందాల్



జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరిస్తున్న వకుల్ జిందాల్

గుంటూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రౌడీయిజం, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతానని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. వకుల్ జిందాల్ ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయం లోని ఎస్పీ ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరిం చారు. శ్రీసత్యసాయి జిల్లాకు బదిలీ అయిన సతీష్‌కుమార్‌ను శనివారం రాత్రే రిలీవ్ అయ్యారు. ఈ క్రమంలో తొలుత పోలీస్ కార్యాలయానికి వచ్చిన వకుల్ జిందాల్ పోలీస్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం వీరభ ద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత ఎస్పీగా బాధ్యత లు స్వీకరించగా ఏఎస్పీలు రవికుమార్, రమణమూర్తి, హనుమంతు, డీఎస్పీలు అబ్దుల్‌అజీజ్, అరవింద్, మురళీకృష్ణ, భానోదయ, మురళీకృష్ణ, జనార్దన్‌రావు, ఎస్బీ సీఐ అళహరి శ్రీనివాస్, పలువురు సీఐలు, ఎస్‌ఐలు అభినందనలు తెలిపా రు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాజధాని ప్రాంతమైన జిల్లాలో రౌడీషీట ర్లు, డ్రగ్స్ మాఫియాపైనా, మహిళలపై జరిగే నేరాలపైనా ప్రత్యేకంగా దృష్టి సారిం చ నున్నట్లు తెలిపారు. ప్రజలకు మెరు గైన పోలీసింగ్ అందించేందుకు అధికారు లు, సిబ్బంది కలిసికట్టుగా పనిచేసేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. తాను ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉం టానని, ఎవరికి ఎటువంటి సమస్య ఉన్నా నేరుగా ఎప్పుడైనా కలవచ్చని ఎస్పీ స్పష్టం చేశారు.

అధికారులకు దిశానిర్దేశం

శాంతి భద్రతల పరిరక్షణే ప్రథమ కర్తవ్యం కావాలని ఎస్పీ వకుల్ జిందాల్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. బాధ్య తలు స్వీకరించిన అనంతరం అధికారులతో ప్రత్యేకంగా మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉంటూ ఏదైనా సంఘటన జరిగిన వెంటనే స్పం దించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఒక్కోసారి మన స్పందన పెద్దపెద్ద సమస్యలను పరిష్కరిస్తుందని గుర్తుంచు కోవాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ లో శూన్య సహన (జీరో టోలరెన్స్) విధా నాన్ని అవలంబించి అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపాలన్నారు. రౌడీ షీటర్లు, సంఘ విద్రోహ చర్యలకు పాల్పడే వారిపై తరచూ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వారి కదలికలపై చర్యలు తీసుకోవాలన్నారు. సున్నిత ప్రాంతాలపై నిఘా పెట్టాలని ఆదేశించారు. పేకాట, కోడిపందాలు, మ ట్కా, సింగిల్ నంబర్ వంటివి జరగ కుం డా చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదు దారులతో మర్యాదపూర్వకంగా, మానవతా దృక్పథంతో వ్యవహరించాలన్నారు. అనవ సరంగా ఎవరినీ స్టేషన్లకు పిలిపించ రాదన్నారు. సిబ్బందితో కలసి తరచూ గ్రామాలు/వార్డులను సందర్శిస్తూ విజిబు ల్ పోలీసింగ్, ఓపెన్ డ్రింకింగ్, డ్రంకెన్ డ్రైవ్, హెల్మెట్ డ్రైవ్, కార్డన్‌సెర్చ్ వంటి కార్యక్రమాలను నిర్వహించాలన్నారు.

లాఠీ, విజిల్ తప్పనిసరి

రాత్రి గస్తీ విధులు నిర్వహించే సిబ్బంది తమతో పాటు తప్పకుండా లాఠీ, విజిల్ కలిగి ఉండాలన్నారు. అలాగే గస్తీ తిరిగేటప్పుడు తప్పకుండా పోలీస్ సైరన్ మోగించాలన్నారు. స్టేషన్ల పరిధిలో సీసీటీవీ కెమేరాల ఏర్పాటు, వాటి పని తీరును సమీక్షించాలన్నారు.

ఒకటిగా జీవనం.. ఒకేసారి మరణం

● ఆరబెట్టిన దుస్తులు తీస్తుండగా విద్యుదాఘాతానికి గురైన తల్లి

● కాపాడే క్రమంలో తల్లితోపాటు కుమార్తె మృతి

6

కొండవీడు రాజుల సాహిత్య సేవ మరువలేనిది

● అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాదు



● గుంటూరు రైల్వే స్టేషన్‌లో పట్టాలపై పారుతున్న వర్షపు నీరు

వాన.. వరద

గుంటూరులో రెండోరోజూ కుండపోత ● నగరం మొత్తం స్తంభించిన రాకపోకలు ● గంటన్నర సేపు కుంభవృష్టితో జలమయం ● గుంటూరు రైల్వేస్టేషన్‌లో పట్టాలపైకి నీరు

గుంటూరు, గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 14 (ఆంధ్ర జ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పాటు అల్పపీడన ప్రభావంతో జిల్లాలో పలు ప్రాంతాల్లో భారీవర్షం కురి సింది. ఆదివారం మధ్యాహ్నం ఉన్నట్లుండి వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని ఆకాశం నుంచి నీటిని కుమ్మరించినట్లుగా వర్షం పడింది. శనివారం మధ్యా హ్నం పిడుగుల వాన పడగా భీతిల్లిన ప్రజలు తేరుకుంటుండగా ఆదివారం కూడా కుండపోత వర్షం పడింది. గుంటూరు, తెనాలి తదితర ప్రాంతాల్లో భారీవర్షం పడింది. గుం టూరు నగరంలో ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటల సమ యంలో కుండపోతగా ప్రారంభ మైన వర్షం సుమారు గంటన్నర పాటు కురుస్తూనే ఉంది. భారీవర్షం తో జనజీవనంతో పాటు ఎక్కడి కక్కడ రాకపోకలు స్తంభించి పోయాయి. పీకలవాగు, నల్లపాడు రోడ్డు, నందివెలుగురోడ్డు డ్రెయిన్లు ఉప్పొంగాయి. దాంతో ప్రధాన రహదారులతో పాటు కాలనీలు నీట మునిగాయి. బ్రాడీపేట, విద్యానగర్, నల్లపాడు రోడ్డులోని కాలనీలు, కొరిటెపాడులో, ఏటీఅగ్రహారంలో వీధులు జలమయంగా మారాయి. పీకలవాగు ఉప్పొంగడంతో బ్రాడీ పేట, కోబాల్డ్‌పేట, దేవాపురంలో నడుములోతు నీరు ప్రవహించింది. సెల్లార్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌ల్లోకి డ్రెయిన్లలోని నీరు ఉధృతంగా ప్రవహించడంతో కార్లు, ద్విచక్ర వాహనాలు నీట మునిగాయి. కంకరగుంట, మూడొంతెనల ఆర్‌యూబీల కిందకి భారీగా వరదనీరు చేరడంతో వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. జీటీ రోడ్డు, నగరంపాలెం స్టాల్ బాలికల స్కూల్ మెయిన్‌రోడ్లపై వరదనీటితో వాహనదారులు ఎటు వెళ్లాలో తెలియని పరిస్థితి నెల కొన్నది. గార్డెన్స్ నుంచి ఐటీసీ హోటల్‌కి వెళ్లేదారిలో భారీ చెట్టు కూలి కారుపై పడగా అందులోని వ్యక్తి తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. కలెక్టర్ బంగ్లా ప్రాంగణం తటాకంలా మారింది. అనేక ప్రాంతాల్లోని ఇళ్లలోకి భారీగా వర్షపు నీరు చేరింది.

జీఎంసీలో.. కాల్ సెంటర్

భారీ వర్షాల నేపథ్యంలో గుంటూ రు కార్పొరేషన్‌లో కార్యాల యంలో 24 గంటలు (మిగతా 6వ పేజీలో)



గార్డెన్‌లోని అమరావతి ఫుడ్స్ వద్ద కారుపై పడిన భారీ వృక్షం



కంకరగుంట ఆర్‌యూబీలోకి చేరిన వర్షపు నీరు



బ్రాడీపేటలోని ఓ కమర్షియల్ కాంప్లెక్స్ సెల్లార్‌లోకి చేరిన వర్షపునీరు

స్కూళ్లకు సార్లొస్తున్నారు..

- తుది దశకు మెగా డీఎస్సీ మెరిట్ జాబితా
- ఎంపికైన ఉపాధ్యాయులకు 20 నుంచి కౌన్సెలింగ్
- 19న ముఖ్యమంత్రి ద్వారా నియామక పత్రాల పంపిణీ
- రాజధానిలో బహిరంగ సభ.. ప్రతీ మండలం నుంచి బస్సులు
- ఎంపికైన అభ్యర్థితో పాటు మరొకరికి అవకాశం.. ఏర్పాట్లలో అధికారులు

గుంటూరు- విద్య, (నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీరిపోనున్నది. ఈ నెలాఖరుకు స్కూళ్లకు ఉపాధ్యా యులు రానున్నారు. మెగా డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో బాధ్యతలు చేపట్టేందుకు అవసరమైన ఏర్పాట్లు జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వ హించి 16,347 మందిని ఎంపిక చేసిం ది. రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన ఉపాధ్యా యులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 19న స్వయంగా నియామక పత్రా లు అందజేయనున్నారు. ఇందుకు సం బంధించి రాజధాని అమరావతి సచివా లయం సమీపంలో బహిరంగ సభకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉపాధ్యాయులతో నిర్వహించే సభను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేశ్‌తో పాటు, మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరు కానున్నారు. ఈ సభలో పాల్గొనేందుకు అవసరమైన ఆహ్వానాలను నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులకు అధికారులు అందజేస్తున్నారు. ఎంపికైన అభ్యర్థి తన తో పాటు కుటుంబంలోని మరో వ్యక్తిని కూడా సభకు తీసుకువచ్చేందుకు అను మతి ఇచ్చారు. వీరందరూ సభకు హాజ రయ్యేందుకు ప్రతీ మండలం నుంచి ప్ర త్యేకంగా బస్సును ఏర్పాటు చేస్తున్నారు. ఆ బస్సుల ఏర్పాటు బాధ్యతను విద్యా శాఖాధికారులకుప్రభుత్వం అప్పగించింది.



సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైన అభ్యర్థులు

1,130 పోస్టుల భర్తీ

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 1600 ఉపాధ్యాయ పోస్టులకు ప్రభుత్వం డీఎస్సీ నిర్వహించింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మెగా డీఎస్సీ లో ఎంపికైన అభ్యర్థుల మెరిట్ జాబితా తుది దశకు చేరింది. ఇప్పటికే సర్టిఫికెట్ల పరిశీలన పూర్తికాగా అర్హులైన అభ్యర్థుల ను క్యాడర్ల వారీగా ఎంపిక చేసి జాబితా ను విద్యాశాఖ అధికారులు సిద్ధం చేశా రు. ఆదివారం వరకు నిబంధనలను అనుసరించి సర్టిఫికెట్ల పరిశీలన కార్య క్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఈ సర్టిఫికెట్ల పరిశీలనను ఆర్జేడీ లిం గేశ్వరరెడ్డి, గుంటూరు డీఈవో రేణుక పర్యవేక్షిస్తూ కార్యక్రమాన్ని విజయవం తం చేశారు. ఇందులో ప్రస్తుతానికి సుమారు 1,130 పోస్టుల భర్తీకి విద్యా శాఖ సిద్ధమైంది. 530 ఎస్‌జీటీ, 600 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇందుకు సంబం దించి కౌన్సెలింగ్ ప్రక్రియ ఈ నెల 20 నుంచి ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పాఠశాలల్లో ఖాళీ గా ఉన్న పోస్టుల ఆధారంగా మెరిట్ లిస్టు విడుదల చేసి గతంలో ఉపాధ్యా యులను నియమించేవారు. అయితే ఈసారి కౌన్సెలింగ్ తరహాలో ఉపాధ్యా య నియామకాలు చేపట్టనున్నట్లు అధి కారులు తెలిపారు. మెరిట్ ఆధారంగా పాఠశాలలకు ఇచ్చిన ఆప్షన్ల ప్రకారం నియామకాలు జరగనున్నాయి. దీని వల్ల పోస్టుల భర్తీలో రాజకీయ జోక్యం నిరోధించే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

వినాయక నిమజ్జన ఊరేగింపులో అపశ్రుతి

గుంటూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కొరిటెపాడు మెయిన్ రోడ్డులో వినాయక నిమజ్జన ఊరేగింపులో అపశ్రుతి చోటుచేసుకుంది. ఆదివారం రాత్రి ఊరేగింపుగా నిమజ్జనా నికి తరలించేందుకు భక్తులు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో చంద్ర హాస్పిటల్ సెల్లార్‌లో పెద్దఎత్తున బాణసంచాలను నిల్వచేసి ఉంచారు. నిమజ్జనం ప్రారంభం సందర్భంగా సమీపంలోని రోడ్డుపై టపాకాయలు కాల్చారు. దీంతో ఎగిసిపడిన నిప్పురవ్వలు ఆస్పత్రి సెల్లార్‌లోని మందు గుండు సామగ్రిపై పడ్డాయి. దీంతో ఆ మందుగుండు సామగ్రి పేలు తూ మంటలు చెలరేగాయి. పక్కనే ఉన్న జనరేటర్‌కు మంటలు అంటుకున్నాయి. సమా చారం అందుకున్న వెంటనే పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు సిబ్బందితో అక్కడికి చేరుకుని ఆస్పత్రి గ్రౌండ్ ఫ్లోర్లో ఉన్న రోగులను బయటకు తరలించారు. ఫైర్ సిబ్బంది మంటలను అదుపుచేశారు. దీంతో ఎటువంటి ముప్పు వాటిల్లకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.



ఆస్పత్రి సెల్లార్‌లో ఎగిసిపడుతున్న మంటలు

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తమిమ్ అన్సారియా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యాలయాలకు రాని వారు తమ అర్జీలను 'మీకోసం' వెబ్‌సైట్‌లో నమోదు చేసుకొవచ్చని పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాయలంలో ప్రతి రోజు ప్రజలు నుంచి వినతులు స్వీకరించడానికి ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేసామని తెలిపారు. అర్జీలు అందజేసిన తర్వాత వాటి స్థితిని తెలుసుకునేందుకు 1100 నంబరుకు సంప్రదించాలని సూచించారు.

నాయీ బ్రాహ్మణ జేఏసీ..

రాష్ట్ర కార్యదర్శిగా హరిప్రసాద్

గుంటూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర కార్యదర్శిగా సత్యసాయి జిల్లా కదిరికి చెందిన రొడ్డారపు హరి ప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర ప్రతినిధుల సభ గుంటూరులో జరిగింది. రాష్ట్ర కార్యదర్శిగా ఆయన మూడేళ్లు కొనసాగుతారని జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ నరసింహారావు తెలిపారు. రాష్ట్ర హరిప్రసాద్ మాట్లాడుతూ నాయీబ్రాహ్మణ జేఏసీ అన్ని సంఘాలను, నేతలను కలుపుకొని ప్రాంతాలకు, వర్గాలకు అతీతంగా నాయీబ్రాహ్మణల అభివృద్ధి, హక్కుల కోసం జేఏసీ పోరాట పటిమ అభినందనీయమన్నారు. కార్యదర్శిగా తనను నియమించిన అధ్యక్షుడు నరసింహారావుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఇలా అయితే బ్రహ్మదేవుని దర్శనం ఎలా?




బ్రహ్మదేవాలయం మార్గంలో నీరు

చేబ్రోలు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చేబ్రోలులోని అరుదైన చతుర్ముఖ బ్రహ్మ లింగేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించేందుకు దూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో చేరుకుంటారు. ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలకు దేవాలయంలోని కోనేరులో వర్షపు నీరు బయటకు పోయే మార్గం లేక.. ఆలయంలోకి భక్తులు వెళ్లే మార్గం నీటితో నిండిపోయింది. రోజుల తరబడి నీటిని బయటకు తరలించే విషయమై దేవదాయ ధర్మదాయశాఖ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు అంటున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించే వీలు లేక నిరుత్సాహంగా తిరిగి వెళ్తున్నారు. భక్తులు స్వామివారి దర్శనం కలిగేలా చేయాలని కోరుతున్నారు.

ఎన్‌టీఏ నగర కమిటీ ఎన్నిక

గుంటూరు (విద్య)సెప్టెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురంలోని ఎమ్మెల్సీ అలపాటి రాజేంద్రప్రసాద్ కార్యాలయంలో నోబుల్ టీచర్ అసోసియేషన్(ఎన్‌టీఏ) నగర కార్యవర్గ ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. గౌరవ అధ్యక్షులుగా కె.వేణుగోపాల్, అధ్యక్షులుగా కె.వీరరాఘవలు, ప్రధాన కార్యదర్శిగా టి.శ్రీనివాస రావు, ఆర్థిక కార్యదర్శిగా షేక్ రషీద్, అసోసియేట్ అధ్యక్షులుగా వెంకటేశ్వర్లు, ఎస్ నాగరాజు, జీఎస్ఎస్ ప్రసాద్ అదనపు ప్రధాన కార్యదర్శులుగా పూర్ణ చంద్రరావు, ఏవీ కృష్ణారావు, టి.పూర్ణ కుమార్ ఉపాధ్యక్షులుగా రాములు నాయక్, ఎన్.క్రీస్తురాజు, ఎ.వెంకటేశ్వరరావు కార్యదర్శులుగా టి.రవి, ఎస్కే సుభాని, జీటీ సుధీర్ కుమార్ తదితరులను ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి.హైమారావు, షేక్ అబ్దుల్ ఖలీల్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.భాస్కరరావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు పి.లలితబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం బ్యారేజి వద్ద 2.85 లక్షల క్యూసెక్కుల వరద



దిగువకు విడుదల అవుతున్న వరద నీరు

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని భారీగా విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి పెరుగుతోంది. పులిచింతల ప్రాజెక్టుతోపాటు ప్రధాన వాగుల నుంచి 2,85,797 క్యూసెక్కుల వరద నీరు శనివారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్టు ఇరిగేషన్ శాఖ జేఈ రాజేష్ తెలిపారు. రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం నమోదు అవుతుండగా దిగువకు 2,76,250 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాల్వకు 4,538, పశ్చిమ డెల్టాకు 5,009 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గుంటూరు కాల్వకు నీటి విడుదల నిలిపివేశారు. వరద ఉధృతి పెరుగుతుండడంతో నదీ తీర ప్రాంతవాసులు, లంక భూముల రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

కొండవీడు రాజుల సాహిత్య సేవ మరువలేనిది

● అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాదు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మండలి బుద్ధప్రసాదు, మర్రి రాజశేఖర్, డొక్కా తదితరులు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎర్రన్న, శ్రీనాథుడు వంటి కవి పండితుల్ని ఆదరించడంతో పాటు అనేక స్వీయ రచనలు చేసిన కొండవీడు రాజుల సాహిత్య సేవ మరువలేనిదని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాదు అన్నారు. గుంటూరులోని కలెక్టరేట్ రోడ్డులో ఉన్న భారతీయ విద్యా భవన్‌లో కాళిదాసు రచించిన అభిజ్ఞాన శాకుంతలం నాటకానికి కాటయ వేమారెడ్డి రచించిన కుమారగిరి రాజీయమ్ అను వ్యాఖ్యాన గ్రంథ ఆవిష్కరణ, సభ జరిగింది. ఈ కార్యక్రమానికి హిందూ కళాశాల పూర్వ ప్రిన్సిపల్ డాక్టర్ దీవి నరసింహదీక్షిత్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బుద్ధప్రసాదు మాట్లాడుతూ కొండవీడు హెరిటేజ్ సొసైటీ వారు ప్రచురించిన ఈ గ్రంథం కొండవీడు రాజుల సాహిత్య ప్రతిభా పాటవానికి ప్రతీకగా నిలుస్తుందని కొనియాడారు. చరిత్ర అధ్యయనం చేయడం ద్వారా గతంలో జరిగిన పొరపాట్లను, విజయాలను తెలుసుకోగలుగుతామని పేర్కొన్నారు. బ్రిటిష్ మ్యూజియంలో ఉన్న అమరావతి శిల్ప సంపదను వెనక్కి తీసుకురావడం కంటే.. మన దగ్గర చరిత్ర సంపదను రక్షించుకోవాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. డాక్టర్ దీవి నరసింహదీక్షిత్ మాట్లాడుతూ కాళిదాసు వ్యాఖ్యానం రచించిన కొలచాల మల్లినాథసూరి, నాటకాలకు తొలి వ్యాఖ్యలందించిన కాటయ వేముడు ఇద్దరూ తెలుగువారు కావడం మన అదృష్టమన్నారు. ఎమ్మెల్సీ మర్రిరాజశేఖర్ మాట్లాడుతూ కొండవీడు పర్యాటకంగా అభివృద్ధి చెందేందుకు కల్లి శివారెడ్డి గణనీయమైన కృషి చేస్తున్నారని ప్రశంసించారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాదు మాట్లాడుతూ.. గత చరిత్రను, సంస్కృతిని నిర్లక్ష్యం చేసిన సమాజం అభివృద్ధిని సాధించలేదన్నారు. భావితరాలకు సాంస్కృతిక వారసత్వ స్ఫూర్తిని కలిగిస్తున్న కొండవీడు అభివృద్ధి సంస్థ సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథ సంపాదకుడు మోదుగల రవికృష్ణ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కొండవీడు హెరిటేజ్ సొసైటీ కార్యదర్శి కల్లి శివారెడ్డి, గ్రంథ ప్రచురణకు ఆర్థిక సాయం అందించిన ఆవుల మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఒకటిగా జీవనం.. ఒకేసారి మరణం

● ఆరబెట్టిన దుస్తులు తీస్తుండగా విద్యుదాఘాతానికి గురైన తల్లి

● కాపాడే క్రమంలో తల్లితోపాటు కుమార్తె మృతి



భాగ్యమ్మ(ఫైల్)



పిచ్చమ్మ (ఫైల్)

పొన్నూరుటౌన్, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): ఆరబెట్టిన దుస్తులు తీస్తుండగా విద్యుదాఘాతానికి గురై తల్లి, కుమార్తె మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు, బాధితుల కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని జూపూడి గ్రామానికి చెందిన భాగ్యమ్మ (68).. కుమార్తె రేమల్ల పిచ్చమ్మ (45) వద్దే ఉంటోంది. ఇద్దరూ వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం తల్లి, కుమార్తె వ్యవసాయ పనులు నిమిత్తం వెళ్లి.. తిరిగి వచ్చారు. వర్షం కురుస్తుండటంతో ఇంటి వద్ద ఇనుప తీగపై ఆరబెట్టిన దుస్తులను తీసే క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యారు. తొలుత భాగ్యమ్మ విద్యుదాఘాతానికి గురవ్వగా.. గమనించిన కుమార్తె పిచ్చమ్మ తల్లిని కాపాడే క్రమంలో తాను కూడా కరెంట్‌షాక్‌కు గురైంది. తల్లి, కుమార్తె ఇద్దరూ ఘటనా స్థలంలోనే మృతి చెందారు. వీరి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాలను శవ పరీక్షల నిమిత్తం నిడుబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పీ- 4లో అందరి భాగస్వామ్యం కావాలి

● గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ-4 కార్యక్రమం కేవలం డబ్బులు ఇవ్వడం కాదని, అదొక సామాజిక బాధ్యతని, అందులో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం కావాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. పీ-4 అమలులో సవాళ్లు- పరిష్కారాలు అనే అంశంపై ఆదివారం గుంటూరు క్లబ్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఎమ్మెల్యే నసీర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజా, ఎమ్మెల్యే బూర్ల రాజాంజనేయులు, స్వర్ణాంధ్ర సాధన కమిటీ చైర్మన్ కుటుంబరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీ-4 కార్యక్రమం ఒక దార్శనికుని ఆలోచనలకు ప్రతిరూపమని తెలిపారు. సమాజంలోని ఆర్థిక అంతరాలను దూరం చేయాలనే సంకల్పంతో ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశారని వివరించారు. పీ-4పై కొంత అపోహలు ఉన్నాయని, అవి పూర్తిగా తొలగిపోయేలా అవగాహన కల్పించాలని చెప్పారు. పీ- 4 కుటుంబాల్లో ఎలాంటి అవసరం వచ్చినా తామున్నామని భరోసా కల్పించగలిగితే సమాజంలో అంతరాలు తొలగిపోతాయని చెప్పారు. సీఎం చంద్రబాబు విజన్‌తో చేపట్టిన కార్యక్రమాలు భావితరాలకు అద్భుతమైన అవకాశాలను అదించాయని చెప్పారు.

తల్లిదండ్రుల ఆశయ సాధన కోసం విద్యార్థులు పాటుపడాలి

● పారిశ్రామికవేత్త శ్రీకృష్ణమూర్తి



ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్న శ్రీకృష్ణమూర్తి

గుంటూరు (విద్య) సెప్టెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ లక్ష్యసాధన కోసం కృషి చేస్తూనే, తల్లిదండ్రుల ఆశయ సాధన కోసం పాటుపడాలని ప్రముఖ పారిశ్రామికవేత్త బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి విజ్ఞప్తి చేశారు. ఆదివారం వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆర్యవైశ్య అఫిషియల్ అండ్ ప్రొఫెషనల్స్ (ఆవోప) ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ముఖ్య అతిథిగా విచ్చేసి, మాట్లాడారు. కార్యక్రమానికి ఆవోప రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు అధ్యక్షత వహించారు. 240 మంది పేద విద్యార్థులకు రూ.45 లక్షల ఉపకార వేత్తనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రేన్ సంస్థల అధినేత గ్రంధి కాంతారావు, ఆవోప నగర అధ్యక్షుడు కేవీ బ్రహ్మం, ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ గార్లపాటి సత్యనారాయణ, నాగేశ్వరరావు, పువ్వాడ చంద్రశేఖర్, రాష్ట్ర కార్యదర్శి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వాన.. వరద

(5వ పేజీ తరువాయి)

పనిచేసేలా కాల్‌సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఏమైనా సమస్యలు ఎదురైతే నగరవాసులు 0863-2345103 నెంబర్‌కు కాల్ చేయవచ్చని కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. నగర పరిధిలోని సచివాలయాలతో పాటు జీఎంసీ ఉద్యోగులకు సెలవులు రద్దు చేస్తూ అప్రమత్తం చేశారు.

రైల్వే ట్రాక్‌పైకి నీరు.. రైళ్లు ఆలస్యం

క్లౌడ్‌బర్స్ట్ తరహాలో నగరంలో రెండు రోజులుగా కురుస్తోన్న వర్షాలతో వరదనీరు డ్రెయిన్లలో సరిగా ప్రవహించక రైల్వేస్టేషన్‌లోకి చేరింది. ప్లాట్‌ఫాంలలోని పట్టాల పైకి వరదనీరు చేరడంతో ట్రాక్ సర్క్యూట్ ఫ్యూజులు కాలిపోయాయి. రెండు ట్రాక్‌లు డ్రాప్ చేశారు. నంబరు.12078 విజయవాడ - చెన్నై సెంట్రల్ జనశతాబ్ది ఎక్స్‌ప్రెస్‌కి మణిపురం వద్ద ట్రాక్ సర్క్యూట్ డ్రాప్ కావడంతో సుమారు అరగంటకు పైగా నిలిపేశారు. దీంతో శబరి ఎక్స్‌ప్రెస్‌ని గుంటూరు రైల్వేస్టేషన్‌లోనే 20 నిమిషాల పాటు నిలపాల్సి వచ్చింది. రైల్వే అధికారులు, సిబ్బంది మరమ్మతులు చేయడంతో రైళ్ల రాకపోకలు పునరుద్ధరణ జరిగాయి. ఆ తర్వాత విజయవాడ - లింగంపల్లి ఇంటర్‌సిటీ, తిరుపతి - వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లు సాధారణంగానే ప్రయాణించాయి.



స్తంభాలగరువులోని రాజ్యలక్ష్మి నగర్ వీధిలో నిలిచిన నీరు



లక్ష్మీపురం మెయిన్ రోడ్డులో ఉధృతంగా ప్రవహిస్తున్న వర్షపు నీరు



ఉధృతంగా ప్రవహిస్తున్న పీకల వాగు



గుంటూరు రైల్వేస్టేషన్‌లో ట్రాక్‌పై నిలిచిన వర్షపు నీరు



విద్యా నగర్ 2/4లో ఓ గృహంలో చేరిన వర్షపు నీరు

ట్రినిటీ ప్యారిస్ చర్చిలో.. ఘనంగా యూత్ సండే ఫెస్టివల్

గుంటూరు, సెప్టెంబర్ 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కొత్తపేటలోని కొమ్ముల ఆసుపత్రిలో గల ట్రినిటీ ప్యారిస్ చర్చిలో ఆదివారం యూత్ సండే ఫెస్టివల్ ఘనంగా జరిగాయి. ఏఈఎల్‌సీ సెక్రటరీ జస్టిస్ ఎన్.జేసు రత్నకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని, వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత పేదలు, అనాథలను ఆదుకునేందుకు సేవలు అందించాలని కోరారు. ఏఈఎల్‌సీ సంస్కరణకు అవలంబించాల్సిన విధానాలను వివరించారు. చర్చి కమిటీ ప్రతినిధులు జస్టిస్ రత్నకుమార్‌ను ఘనంగా సత్కరించారు. పాస్టర్లు జె.దైవాశీర్వాదం, పి.రమేష్ పాల్గొన్నారు.

సచివాలయంలో భద్రతా ఏర్పాట్ల పరిశీలన

● నేటి నుంచి కలెక్టర్ల సదస్సు.. అనంతరం అసెంబ్లీ సమావేశాలు



ఏర్పాట్లపై అధికారులకు ఆదేశాలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాజధానిలోని సచివాలయంలో సోమవారం నుంచి రెండు రోజుల పాటు కలెక్టర్ల సదస్సు జరగనుంది. అనంతరం అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. అదే విధంగా డీఎస్సీ అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయనున్నారు. రాజధానిలో ఈ కార్యక్రమాల నేపథ్యంలో సచివాలయం వద్ద బందోబస్తు ఏర్పాట్లను గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పరిశీలించారు. ఆదివారం ఉదయం ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన జిందాల్ ఆ తర్వాత డీఎస్పీలు, సీఐ, ఎస్ఐలతో సమీక్ష సమావేశం నిర్వహించి వారికి దిశా నిర్దేశం చేశారు. వెలగపూడి సచివాలయంలో కలెక్టర్ల సదస్సుకు సంబంధించి 5వ బ్లాక్ నందు జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి, వీవీఐపీ, వీఐపీలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఎక్కడికక్కడ బారికేడింగ్‌తో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ నెల 18న సచివాలయంలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో వీవీఐపీ, వీఐపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల రాకపోకల మార్గాలను, పార్కింగ్ ప్రదేశాలను, మీడియా పాయింట్ వంటి పలు ప్రదేశాలను పరిశీలించి, తగిన ఏర్పాట్లు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఈ నెల 19న వెలగపూడి సచివాలయం వెనుక భాగంలో నిర్వహించే డీఎస్సీ అభ్యర్థులకు నియామక పత్రాల అందజేత కార్యక్రమ నిర్వహణ ప్రదేశాన్ని పరిశీలించి, పలు సూచనలు చేశారు. తుళ్లూరు డీఎస్పీ మురళీ కృష్ణ, ఎస్‌బీ సీఐ అలహరి శ్రీనివాసరావు, తుళ్లూరు సీఐ కొంకా శ్రీనివాసరావు, తుళ్లూరు ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వలస కూలీ దంపతుల ఆత్మహత్యాయత్నం

తెనాలి క్రైం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కూలి పనుల కోసం విజయనగరం జిల్లా నుంచి వలస వచ్చిన దంపతులు కుటుంబ కలహాల నేపథ్యంలో ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. ఈ ఘటన ఆదివారం తెనాలి బాలాజీ రావుపేటలో చోటుచేసుకుంది. త్రీ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విజయనగరానికి చెందిన అనకాపల్లి ప్రసాద్, అనురాధ భార్యభర్తలు. ఐదేళ్ల క్రితం కూలి పనుల కోసం తెనాలికి వలస వచ్చి బాలాజీరావుపేటలో నివాసం ఉంటున్నారు. వీరికి ఐదు, నాలుగు సంవత్సరాల వయసు గల ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. సాయంత్రం పక్కంటి వారు.. వారి ఇంటిలోకి వెళ్లగా భార్యభర్తలు ఇద్దరూ అపస్మారక స్థితిలో పడిఉన్నారు. తోటి వారి సాయంతో వెంటనే వాళ్లను తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. భార్య ఆరోగ్య స్థితి కొంత ఆందోళనకరంగా ఉంది. కేసు నమోదు చేసి, విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆందోళనకరంగా భార్య పరిస్థితి

స్త్రీ శక్తి.. సూపర్

(5వ పేజీ తరువాయి)

ఆదరణ లభిస్తోంది. జిల్లాలో పెద్దఎత్తున మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణించేందుకు ముందుకు వస్తున్నారు. మహిళా ప్రయాణికుల సంఖ్య రోజురోజుకు గణనీయంగా పెరుగుతున్నా ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ యంత్రాంగం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటోంది. జీరో టిక్కెట్లు జారీ చేస్తూ రోజువారీ ఎంత మంది మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్నారో నమోదు చేస్తోంది. భవిష్యత్తులో మరింతగా పెరిగే ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా అదనపు బస్సులను సిద్ధం చేసుకోవడంపై ఆర్టీసీ దృష్టి సారించింది. ఇదిలా ఉంటే స్త్రీశక్తి పథకం అమలయ్యాక జిల్లాలో తిరిగే హైటెక్ బస్సుల్లో ఆక్యుపెన్సీలో స్వల్ప స్థాయి తగ్గుదల కనబడుతోంది. మొత్తం ఉన్న బస్సుల్లో హైటెక్ బస్సుల సంఖ్య అతి స్వల్పంగా ఉండడంతో అది ఆర్టీసీ ఆదాయంపై పెద్దగా ప్రభావం చూపదనే అభిప్రాయాన్ని యంత్రాంగం వ్యక్తం చేస్తోంది. ఉదయం 8 గంట నుంచి 11 గంటల వరకు సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకు మహిళల రద్దీ బస్సుల్లో ఎక్కువగా ఉంటోందని ఆర్టీసీ వర్గాలు తెలిపాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.45 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	139, 150, 157
చికెన్ విత్ స్కిన్(కిలో)	264.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	274.00

వర్షాలపై జీఎంసీ కాల్ సెంటర్

● కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరుకార్పొరేషన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో వర్షం వల్ల నిలబడిన నీటిని బయటకు పంపేందుకు.. యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులు కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఆదేశించారు. ఎక్సకవేటర్లను అద్దె ప్రాతిపదికనైనా తీసుకొని నగరంలో నీరు నిలబడిన ప్రాంతాలని బెయిల్ అవుట్ చేయడానికి ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్ష సూచన నేపథ్యంలో సచివాలయ కార్యదర్శులు, ఉద్యోగులు సెలవులు తీసుకోవద్దని స్పష్టం చేశారు. పట్టణ ప్రజల ఫిర్యాదులకు 24 గంటలు పని చేసేలా జీఎంసీ ప్రధాన కార్యాలయంలో 0863-2345103 కాల్ సెంటర్ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డిప్యూటీ కమిషనర్లు పర్యవేక్షణ చేస్తున్నారన్నారు.

● గుంటూరు(విద్య): పట్టణంలోని సీతారామనగర్ శ్రీసరస్వతీ కమిటీ ఎయిడెడ్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆదివారం దక్షిణ భారత హిందీ ప్రచారసభ పరిచయ ప్రాథమిక, మాధ్యమిక పరీక్షలు జరిగినట్లు పాఠశాల కరస్పాండెంట్ డీవీ సుబ్బారావు తెలిపారు.

● గుంటూరు(తూర్పు): ఇన్నర్‌రింగ్‌రోడ్డులోని శ్రీ చైతన్య కళాశాల మైదానంలో ఏర్పాటుచేసిన 99 అడుగుల మట్టి మహాగణపతి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. స్వామివారికి 99కిలోల లడ్డూప్రసాదాన్ని పాతగుంటూరుకు చెందిన యడ్ల నాగమల్లేశ్వరరావు అందజేశారు. కమిటీసభ్యులు నరేంద్ర, రాజానాయుడు, లక్ష్మీనారాయణరెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఆర్ఈఆర్ఏ సభ్యుడిగా దామచర్ల



గుంటూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ సభ్యుడిగా టీడీపీ సీనియర్ నాయకుడు, ఆడిటర్ దామచర్ల శ్రీనివాసరావు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆదివారం మున్సిపల్ పరిపాలనశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఐజీని కలిసిన ఎస్పీ

గుంటూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన వకుల్‌జిందాల్ గుంటూరు రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి జిల్లాలో శాంతిభద్రతలపై చర్చించారు.

జేఎస్ శాస్త్రి కన్నుమూత



జొన్నలగడ్డ శ్రీరామచంద్రశాస్త్రి

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): దివంగత సినీహీరో కృష్ణంరాజు ఫ్యాన్స్ రాష్ట్ర అధ్యక్షుడు, సెన్సార్ బోర్డు మాజీ సభ్యుడు జొన్నలగడ్డ శ్రీరామచంద్రశాస్త్రి మృతిచెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బ్రాడీపేటలోని ఆయన స్వగృహంలో ఆదివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. ఆయన మృతదేహాన్ని కన్నా మాస్టారు, స్థానిక కార్పొరేటర్ ఆచారి సందర్శించి నివాళులర్పించారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



వృద్ధుడి మృతదేహం

గుంటూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని నెహ్రూనగర్ 1వ లైనులో గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో కొత్తపేట పోలీసులు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతదేహాన్ని గుర్తించినవారు సీఐ వీరయ్యచౌదరి నం.8688831320కు తెలపాలన్నారు.

గ్రామ స్థాయిలో మహిళా సాధికారత సాధించాలి

● గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి



ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయిలో మహిళా సాధికారతను సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉందని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. తిరుపతిలో రెండు రోజుల పాటు జరగనున్న జాతీయ మహిళా సాధికారత తొలి సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సదస్సులో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి మహిళా ప్రజాప్రతినిధులు, పార్లమెంటరీ కమిటీ సభ్యులు పాల్గొన్నారని తెలిపారు. మహిళా హక్కులు, చట్టసభల్లో వారి ప్రాతినిధ్యం, గ్రామీణ స్థాయిలో మహిళా సాధికారతను ప్రోత్సహించడం వంటి అనేక అంశాలపై చర్చలు జరిగాయని తెలిపారు. సమావేశం ద్వారా మహిళా ప్రజాప్రతినిధులు తమ అనుభవాలను, ఆలోచనలను పంచుకోవడానికి ఒక వేదిక లభించిందని, ఇది భవిష్యత్తులో మహిళా సాధికారతకు బలమైన పునాది వేస్తుందని గళ్లా మాధవి అభిప్రాయపడ్డారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉన్న ఏకైక మహిళా ఎమ్మెల్యేగా ఈ సదస్సులో పాల్గొనడం గర్వంగా ఉందని మాధవి తెలిపారు.



మోహిని, భస్మాసుర ప్రదర్శనలో ఓ సన్నివేశం

ఘనంగా ముగిసిన

కూచిపూడి నృత్యోత్సవాలు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం ఆవరణలో రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివిటీ అండ్ కల్చరల్ కమిషన్ సహకారంతో కేఆర్‌కే ఎం మెమోరియల్ అకాడమీ ఆఫ్ ఫైనాన్స్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న అమరావతి నృత్యోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ముంగిపు ఉత్సవాల్లో చివరి రోజు వైదేహి సుభాష్ సారథ్యంలో సాత్విక మణిప్రసాద్, గాయత్రి చే భరతనాట్యం, బెంగళూరుకు చెందిన శ్రీనిధిహొల్ల, అనన్య, ఆర్ శాస్త్రిల మోహిని -భస్మాసుర, రవి కూచిపూడి శిష్య బృందం కూచిపూడి, ఒడిశాకు చెందిన భూపతి గాయత్రి ఒడిశీ నృత్య ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం రాష్ట్ర అధికారి మద్దినేని సుధాకర్, రాయన గిరిధర్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొనగా, కోకా విజయలక్ష్మి పర్యవేక్షించారు.

లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ పోస్టర్స్ ఆవిష్కరణ



పోస్టర్స్ ఆవిష్కరిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

గుంటూరు(విద్య) సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయులు పోస్టుల పోస్టులు భర్తీ చేస్తున్న కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ.. రూపొందించిన పోస్టర్స్‌ను కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆదివారం ఆవిష్కరించారు టీఎన్‌యూఎస్ ఆధ్వర్యంలో రూపొందించిన ఈ పోస్టర్స్ ఆవిష్కరణ కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నజీర్ పాల్గొన్నారు. ఎన్నికల హామీలో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం డీఎస్సీ నిర్వహించడం, ఈ నెల 19న ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తున్నట్లు డాక్టర్ చంద్రశేఖర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌యూఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎన్‌వీ జగదీష్ కుమార్, జిల్లా అధ్యక్షుడు పసల బాలస్వామి, ప్రధాన కార్యదర్శి పాలేటి జగదీష్ బాబు, కోశాధికారి శ్రీనివాస్‌రెడ్డి, సహాధ్యక్షుడు జీవీ శ్రీధర్ పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

● జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరెడ్డి

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉంటూ లక్ష్యాల సాధనకు నిరంతరం కృషిచేయాలని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి హితవుపలికారు. ఆదివారం గుంటూరులోని ఏసీ కళాశాల అసెంబ్లీ హాలులో ఎన్ఎంఎంఎస్ శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి పాల్గొన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ విద్యార్థులు చిన్నవయసు నుంచే ఆరోగ్య నియమాలను పాటిస్తూ జీవన ప్రమాణాలు పెంపొందించుకోవాలన్నారు. మానవత కార్యదర్శి కె.సతీష్, ప్రధాన శిక్షకులు ప్రకాష్, ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మోజెస్, మానవత స్వచ్ఛంద సేవసంస్థ నేతలు టి.ధనుంజయరెడ్డి, ఉప్పల సాంబశివరావు, లక్ష్మీసామ్రాజ్యం, ఉమామహేశ్వరరావు, చంద్రమౌళిరెడ్డి ప్రసంగించారు.

ఆది ఆచార్యులు బ్రాహ్మణులు

● జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ కృష్ణమూర్తి

గుంటూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సమాజంలో గురు పరంపరకు మూలం బ్రాహ్మణం అని తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య జీఎస్ఆర్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. అందుకే ఆది ఆచార్యుల స్థానం బ్రాహ్మణులకే సొంతమన్నారు. బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో బ్రాడీపేటలోని బ్రాహ్మణ సేవా సమితి కార్యాలయంలో ఆదివారం రాష్ట్రంలోని 13 జిల్లాలకు చెందిన 56 మంది బ్రాహ్మణోత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు ప్రదానం చేశారు. బ్రాహ్మణసేవా సంఘ సమాఖ్య అధ్యక్షుడు జ్వాలాపురం శ్రీకాంత్, కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), శారదాంబ, సంఘం నాయకులు పురుషోత్తమశర్మ, అంజిబాబు, రామభద్రుడు, సుబ్బారావు, నిమ్మరాజు శారదా పాల్గొన్నారు.

ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయాలి

● ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో వినూత్న నిరసన

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను తక్షణమే భర్తీచేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్‌వలీ డిమాండ్ చేశారు. కొత్తపేటలో ఆదివారం సమాఖ్య ఆధ్వర్యంలో అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థల్లో ప్రొఫెసర్, లెక్చరర్, టీచింగ్, నాన్-టీచింగ్, లైబ్రరీ ఉద్యోగులతో పాటు ఎస్సీ ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. నోటిఫికేషన్ ఇచ్చే వరకు అభ్యర్థులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలన్నారు. ఈ నేపథ్యంలో 17న విజయవాడలో జరిగే నిరుద్యోగి ఆవేదన సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జంగాల చైతన్య, శ్రీనివాసరావు, చల్లా మరియదాసు, అరుణ్, సద్దాం తదితరులు పాల్గొన్నారు.



చేబ్రోలు సరస్వతిదేవి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, పలువురు ప్రముఖులు

చేబ్రోలు సరస్వతీదేవికి ప్రముఖుల ఘన నివాళి

గుంటూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి దివంగత చేబ్రోలు హనుమయ్య పెద్దకోడలు, చేబ్రోలు రాజేంద్రప్రసాద్ సతీమణి దివంగత సరస్వతిదేవికి పలువురు ప్రముఖులు ఘన నివాళులర్పించారు. ఇన్నర్ రింగ్ రోడ్డులోని శ్రీకన్వెన్షన్‌లో సరస్వతిదేవి పెద్దకర్మ ఆదివారం జరిగింది. మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు, కన్నా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీలు ఆలపాటి రాజేంద్రప్రసాద్, లేళ్ల అప్పిరెడ్డి, డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, నన్నపనేని రాజకుమారి, మాజీ ఎమ్మెల్యేలు దగ్గుబాటి వెంకటేశ్వరరావు, కిలారి రోశయ్య, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, విజ్ఞాన్ విద్యా సంస్థల అధినేత లావు రత్తయ్య, సీపీఐ రాష్ట్ర నాయకులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు, చేబ్రోలు రాజేంద్ర సోదరుడు చేబ్రోలు నరేంద్రకుమార్, పలువురు ప్రముఖులు హాజరై సరస్వతిదేవి చిత్రపటానికి ఘన నివాళులర్పించారు.

దిక్సూచి



మేనేజ్‌మెంట్, కామర్స్ విద్యార్థుల కోసం ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ(ఇగ్నో) కొన్ని ఉచిత కోర్సులను అందిస్తోంది. కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని 'స్వయం' (https://swayam.gov.in) - పోర్టల్‌లో ఈ కోర్సుల పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు. అలాగే ఎన్‌రోల్ కావచ్చు.

మేనేజ్‌మెంట్ విద్యార్థుల కోసం 'ఇగ్నో' ఉచిత కోర్సులు

బిజినెస్ లా: సోషల్, డొమెస్టిక్, మోరల్, రిలీజియస్, కమర్షియల్‌కి సంబంధించిన అగ్రిమెంట్స్ మొదలైన వాటిపై కోర్సు ఉంటుంది. 16 వారాల కోర్సు. పరీక్షలు డిసెంబర్ రెండో వారంలో ఉంటాయి. ప్రొఫెసర్ డా.మధులిక సారికర్ బోధిస్తారు.

ఇన్‌కంటాక్స్ లా అండ్ ప్రాక్టీస్: ఇన్‌కంటాక్స్ చట్టాలు, ప్రాక్టీస్ పట్ల విద్యార్థులకు అవగాహన పెంచడం కోసం ఉద్దేశించిన 15 వారాల కోర్సు ఇది. డిసెంబర్ రెండో వారంలో పరీక్షలు నిర్వహిస్తారు.

ప్రిన్స్‌పల్స్ ఆఫ్ మార్కెటింగ్: ఏ వ్యాపారంలోనైనా మార్కెటింగ్ రోల్‌ను అర్థం చేసుకోవడం, తదితరాలపై ఏర్పాటు చేసిన కోర్సు ఇది. ప్రొఫెసర్ డాక్టర్ అనుప్రియా పాండే దీనిని బోధిస్తారు. 16 వారాలలో కోర్సు. డిసెంబర్ రెండో వారంలో పరీక్షలు నిర్వహిస్తారు.

బిజినెస్ కమ్యూనికేషన్: బిజినెస్ కమ్యూనికేషన్ ఎలా జరుగుతుంది, మీటింగ్స్, బిజినెస్ డీలింగ్స్, క్లయింట్ ప్రజంటేషన్ తదితరాలన్నీ ఇందులో బోధిస్తారు. ప్రొఫెసర్ డాక్టర్ రశ్మీ బన్సాల్ దీనిని బోధిస్తారు. మొత్తం 12 వారాల కోర్సు. పరీక్షలు 2025 డిసెంబర్‌లో ఉంటాయి.

ఫైనాన్షియల్ లిటరసీ: ఫైనాన్స్‌లో కెరీర్ ఎంచుకోవాలనుకునే వారికి ఉద్దేశించిన కోర్సు ఇది. భారత దేశంలో ఫైనాన్షియల్ సెక్టార్‌లో పేరొందిన వారు బోధిస్తారు.

ఎంట్రప్రెన్యూర్ స్కిల్స్ అండ్ డిజిటల్ మార్కెటింగ్ స్ట్రాటజీస్: కోర్సు వ్యవధి 12 వారాలు. ఎంట్రప్రెన్యూర్‌షిప్ ఫండమెంటల్స్, డిజిటల్ మార్కెటింగ్ స్ట్రాటజీస్ తదితరాలపై కోర్సు ఉంటుంది. ఎంట్రప్రెన్యూర్స్ కావాలనుకునే వారిని, కాలేజ్ లెర్నర్స్, చిన్న బిజినెస్ వారిని ఉద్దేశించి తయారు చేశారు. వారికి ప్రాక్టికల్ నాలెడ్జ్ కల్పిస్తారు.

ఫైనాన్షియల్ అకౌంటింగ్: అకౌంటింగ్, అకౌంటింగ్ ప్రాసెస్, ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్ ప్రిపరేషన్, అండర్ స్టాండింగ్, ఇంటర్‌ప్రిటేషన్ ఆఫ్ ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్ తదితరాలను ప్రొఫెసర్ సునీల్ కుమార్ బోధిస్తారు. మొత్తం 16 వారాల కోర్సు. 2025 డిసెంబర్‌లో పరీక్షలు నిర్వహిస్తారు.

బిజినెస్ ఆర్గనైజేషన్ అండ్ మేనేజ్‌మెంట్: బిజినెస్ అండ్ బిజినెస్ ఎంట్రప్రైజెస్‌పై ఉంటుంది. ప్రొఫెసర్ నావెల్ కిశోర్, అతని టీమ్ దీనిని బోధిస్తారు. 16 వారాల కోర్సు. పరీక్షలు 2025 డిసెంబర్‌లో నిర్వహిస్తారు.

బ్యాంక్ ఉద్యోగాలు



ఎస్‌బిఐలో మేనేజర్లు

ఖాళీలు 122

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెగ్యులర్ ప్రాతిపదికన 122 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- మేనేజర్(క్రెడిట్ అనలిస్ట్): 63 పోస్టులు
- మేనేజర్(ప్రొడక్ట్స్-డిజిటల్ ప్లాట్‌ఫామ్స్): 34 పోస్టులు
- డిప్యూటీ మేనేజర్(ప్రొడక్ట్స్ డిజిటల్ ప్లాట్‌ఫామ్స్): 25 పోస్టులు

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ/ ఎంబీఏ/పీజీడీబీఏ/ పీజీడీబీఎం/ సీఏ/సీఎఫ్‌ఏ/ఐసీడబ్ల్యూఏ/ బీఈ/బీటెక్ తోపాటు పని అనుభవం ఉండాలి.

వయస్సు: మేనేజర్‌కు 28-35 ఏళ్లు, డిప్యూటీ మేనేజర్‌కు 25-32 ఏళ్లు, మేనేజర్ క్రెడిట్ అనలిస్ట్ 25-35 ఏళ్ల మధ్యలో ఉండాలి.

చివరి తేదీ: 2025 అక్టోబర్ 2

వెబ్‌సైట్: https://sbi.bank.in/

ఐఓబీలో స్పెషలిస్ట్ ఆఫీసర్లు

ఖాళీలు 127

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్(ఐఓబీ)లో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న స్పెషలిస్ట్ ఆఫీసర్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ వెలువడింది.

అర్హత: డిగ్రీ/బీఆర్క్/బీటెక్/బీఈ, ఎంఎస్సీ/ ఎంఈ/ ఎంటెక్ ఎంబీఏ/పీజీడీబీఏ/పీజీడీఎమ్ పాసై ఉండాలి.

వయస్సు: 2025 సెప్టెంబర్ 1 నాటికి పోస్టులను అనుసరించి 25 నుంచి 40 ఏళ్ల మధ్యలో ఉండాలి. రిజర్వేషన్లను అనుసరించి వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా జరుగుతుంది.

చివరి తేదీ: 2025 అక్టోబర్ 3

వెబ్‌సైట్: www.iob.bank.in/Careers

ఆర్‌బిఐలో గ్రేడ్-బి ఆఫీసర్లు

ఖాళీలు 120

రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియాలో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 120 ఆఫీసర్ గ్రేడ్-బీ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది.

- ఆఫీసర్స్ గ్రేడ్ బీ(జనరల్ కేడర్): 83
- ఆఫీసర్స్ గ్రేడ్-బీ(డీఈపీఆర్ కేడర్): 17
- ఆఫీసర్స్ గ్రేడ్-బీ(డీఎస్ఐఎమ్ కేడర్): 29

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ పాసై ఉండాలి. పని అనుభవం కూడా ఉండాలి.

వయస్సు: 2025 సెప్టెంబర్ 1 నాటికి 21 నుంచి 30 సంవత్సరాల మధ్యలో ఉండాలి.

ఎంపిక విధానం: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా

చివరి తేదీ: 2025 సెప్టెంబర్ 30

వెబ్‌సైట్: https://opportunities.rbi.org.in/



స్కూలు టీచర్ల కోసం మద్రాసు ఐఐటీ ఫ్రీ ఏఐ కోర్సులు

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ప్రతీ రంగాన్ని రీషేపింగ్ చేసింది. దీనికి అతీతమైన రంగం అంటూ ఇప్పుడు లేదు. దీనికి ఎడ్యుకేషన్ మినహాయింపు ఏమీ కాదు. లెర్నింగ్ ప్రక్రియను ఏఐ పూర్తిగా మార్చేసింది. ఈ ప్రక్రియను ఎవరైతే తరగతి గది వరకు తీసుకెళ్లగలరో వారే భవిష్యత్తులో విజయవంతమైన ఉపాధ్యాయులుగా నిలబడగలుగుతారు. దేశానికి అలాంటి టీచర్లను తయారు చేయడం కోసం మద్రాస్ ఐఐటీ ఒక ప్రోగ్రామ్‌ను రూపొందించింది. కిండర్ గార్టెన్ మొదలుకుని ఇంటర్ వరకు దేశవ్యాప్తంగా ఉన్న స్కూలు టీచర్ల కోసం 'ఏఐ ఫర్ ఎడ్యుకేటర్స్' పేరుతో ఉచిత ఆన్‌లైన్ కోర్సులను ప్రారంభించింది. కేంద్ర ప్రభుత్వ స్వయం పోర్టల్ ద్వారా ఈ కోర్సులు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయి. గతంలో 'ఏఐ ఇన్ ఫిజిక్స్', 'ఏఐ ఇన్ కెమిస్ట్రీ', 'ఏఐ ఇన్ అకౌంటింగ్', 'క్రికెట్ అనాలిసిస్ విత్ ఏఐ', 'పైథాన్ ద్వారా ఏఐ/ఎంఎల్' కోర్సులను తెచ్చింది.

- 'ఏఐ ఫర్ ఎడ్యుకేటర్స్' కోర్సు కాలవ్యవధి 25 నుంచి 45 గంటలు. ఇది పూర్తిగా ఉచితం. దీనిలో సర్టిఫికెట్ కావాలనుకునే వ్యక్తులు నామ మాత్రపు ఫీజు చెల్లించి, ఎంపిక చేసిన కేంద్రాల్లో పరీక్ష రాయాలి. సర్టిఫికెట్ వద్దు అనుకునేవారు ఆన్‌లైన్ కోచింగ్‌తోనే ఆపేయవచ్చు.
- ఏఐ అవగాహన పెంచుకోవాలనుకునేవారు, ఏఐతో తమ బోధన ప్రమాణాలు పెంచుకోవాలనుకునేవారు ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకోవచ్చు. దీనికి ఎలాంటి ఏఐ, కోడింగ్ అనుభవం అవసరం లేదు. డిజిటల్ లిటరసీ ఉంటే చాలు అని చెబుతున్నారు మద్రాస్ ఐఐటీ డైరెక్టర్ వి.కామకోటి. ఆర్ట్స్, కామర్స్, సైన్స్ ఇలా అన్ని రంగాల వారికీ ఉపయోగ పడేలా ఈ కోర్సును డిజైన్ చేశారు. 2025 అక్టోబర్ 10లోపు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు.

వెబ్‌సైట్: swayamplus. swayam2.ac.in/aiforallcourses

SCHOLARSHIP ALERT

JK Tyre Shiksha Sarthi Scholarship Program

Description: JK Tyre & Industries Limited invites applications from daughters of heavy vehicle drivers who are pursuing general or professional undergraduate or diploma courses and reside in select locations.

Eligibility: Open to female students who are HMV Driver's daughters and are enrolled in general or professional undergraduate or diploma courses.

- Applicants must have secured a minimum of 55% marks in their previous academic year.
- Annual family income must be less than or equal to 5,00,000.
- Applicants must be residents of Rajasthan, Madhya Pradesh, Uttarakhand, Karnataka, and Tamil Nadu.
- Children of employees of JK Tyre and Buddy4Study are not eligible to apply.

Prizes & Rewards: Annual Fixed Scholarship Details:

- Professional Undergraduate Courses: INR 25,000
- General Undergraduate Courses: INR 15,000
- Diploma Courses: INR 15,000

Last Date to Apply: 06-10-2025 *Application mode:* Online Application only

Short Url: www.b4s.in/aj/JKTS3

OakNorth STEM Scholarship Programme

Description: The OakNorth STEM Scholarship Programme is an initiative by OakNorth aimed at supporting underprivileged women aspiring to pursue a degree in STEM (Science, Technology, Engineering, Mathematics). This scholarship is available to female students from Haryana, Uttarakhand, and Bihar who have completed their Class 12 and are currently enrolled in a STEM-related undergraduate program (any year) at government colleges or universities.

Eligibility: The scholarship is available to students who are residents of Haryana, Uttarakhand, and Bihar.

- Only female applicants are eligible for consideration.
- Applicants should be enrolled in an undergraduate STEM program (Science, Technology, Engineering, Mathematics) at government universities or colleges in India, regardless of the year of study.
- Candidates must have secured an aggregate of 75% or more in their Class 12 (or equivalent) exam, with at least 65% in the previous class/semester/year (if applicable).
- The annual family income of the applicant should not exceed 3 lakhs.
- Children of Buddy4Study and OakNorth employees are not eligible to apply.

Prizes & Rewards: 30,000 (fixed amount) *Last Date to Apply:* 30-09-2025


Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/ONSS4

buddy4study.com

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



దసరాకు ఇడ్లీకొట్టు

ధనుశ్ హీరోగా నటిస్తూ స్వీయ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఇడ్లీ కొట్టు'. డాన్ పిక్చర్స్, వండర్‌బార్ ఫిల్మ్ బేనర్‌పై ఆకాశ్ భాస్కరన్, ధనుశ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, పాటలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఇది ధనుశ్ దర్శకత్వం వహిస్తోన్న నాలుగో చిత్రం కావడంతో అంచనాలు భారీగా ఉన్నాయి. దసరా సందర్భంగా తెలుగు, తమిళ్‌లో అక్టోబరు 1న విడుదలవుతోంది చిత్రం. తెలుగులో వేదక్షర మూవీస్ బ్యానర్‌పై నిర్మాత చింతపల్లి రామారావు విడుదల చేస్తున్నారు. సత్యరాజ్, అరుణ్ విజయ్, నిత్యా మీనన్, షాలినీ పాండే కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: జీకే ప్రసన్న, డీఓపీ: కిరణ్‌కౌశిక్, సంగీతం: జీవి ప్రకాశ్‌కుమార్.



'ఉస్తాద్ భగత్ సింగ్' షూటింగ్ పూర్తి

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ కథానాయకుడిగా హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతోన్న సినిమా 'ఉస్తాద్ భగత్ సింగ్'. శ్రీలీల, రాశీ ఖన్నా కథానాయికలుగా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. 'గబ్బర్ సింగ్' వంటి సంచలన విజయం తర్వాత పవన్ కల్యాణ్- హరీష్ శంకర్ కలయికలో వస్తున్న ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌పై అభిమానుల్లో అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. తాజాగా చిత్రబృందం భారీ షెడ్యూల్‌ను విజయవంతంగా ముగించింది. పవన్ కల్యాణ్ కూడా తన భాగం చిత్రీకరణను పూర్తి చేశారు. త్వరలోనే నిర్మాణాంతర కార్యక్రమాలు మొదలు పెట్టనున్నట్లు చిత్రబృందం పేర్కొంది.

మరో పాట సిద్ధం



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఓజీ'. ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయిక. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌పై డీవీవీ దానయ్య నిర్మించారు. సినిమా ఈనెల 25న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. అయితే తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన 'గన్స్ అండ్ రోజెస్' గీతాన్ని నేడు విడుదల చేయనున్నట్లు చిత్రబృందం పేర్కొంది. తమన్ సంగీతం అందించారు. ఈ సందర్భంగా చిత్రబృందం విడుదల చేసిన స్పెషల్ పోస్టర్ నెట్టింట వైరల్ అవుతోంది.

ఊర్వశీ రౌతేలాకు ఈడీ సమన్లు



బెట్టింగ్ యాప్స్ కేసులో భాగంగా బాలీవుడ్ నటి ఊర్వశీ రౌతేలాకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు జారీ చేసింది. '1 ఎక్స్ బెట్' అనే బెట్టింగ్ యాప్ కేసుకు సంబంధించి ఈడీ మంగళవారం ఊర్వశీని విచారించనుంది. నేడు నటి, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మిమి చక్రవర్తి కూడా ఇదే యాప్ కేసు విషయంలో ఈడీ విచారణకు హాజరు కానుంది. కాగా, ఇప్పటికే ఈ కేసు విషయంలో పలువురు సెలబ్రిటీలను ఈడీ విచారించింది.

అలాంటి పాటలు రాయడం చాలా కష్టం



శ్రీమణి

నాగచైతన్య నటించిన '100% లవ్' చిత్రంతో గీతరచయితగా టాలీవుడ్‌లో అడుగుపెట్టారు శ్రీమణి. ఆ తర్వాత వరుస చిత్రాలలో ఆయన రాసిన పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రస్తుతం 'ఆకాశంలో ఒక తార', 'సంబరాల యేటి గట్టు', 'ఇండియా హౌస్' చిత్రాలకు గీతాలు రాస్తున్న శ్రీమణి, తాజాగా మీడియాతో ముచ్చటించారు. 'అత్తారింటికి దారేది'లో పవన్‌కల్యాణ్ కోసం రాసిన 'ఆరడుగుల బుల్లెట్టు' సాంగ్ నా కెరీర్‌కు ఎంతగానో దోహదపడింది. నాకు కావాల్సిన బ్రేక్ ఇచ్చింది. 'ఎమ్‌సీఏ'లో 'ఎక్కడ ఎక్కడ' పాట వల్ల ప్రేమ పాటలకు ఎక్కువగా రాసే అవకాశం దక్కింది. ఒకప్పుడు పాట ప్రేక్షకులకు చేరువ కావడానికి కొంత సమయం పట్టేది. కానీ ఇప్పుడున్న సోషల్ మీడియా ట్రెండ్ పుణ్యమా అని విన్న వెంటనే నచ్చేయాలి. అలాంటి పాటలు రాయడం గీత రచయితలకు చాలా కష్టం. అయినా ఆ సవాల్‌ను స్వీకరించి పాటను పదేళ్ల పాటు గుర్తుపెట్టుకునేలా రాస్తున్నాం. దర్శకుడు సుకుమార్ నేను ఆరాధించే వ్యక్తుల్లో ఒకరు. 'గీత గోవిందం'లో నేను రాసిన 'వచ్చిందమ్మా' పాట విని ఆయన అభినందించడం చాలా గొప్పగా అనిపించింది. అలాగే దివంగత గేయరచయిత, సిరివెన్నెల సీతారామశాస్త్రి గారు 'మహర్షి' పాట విని బాగా రాశావని ప్రశంసించడం మరిచిపోలేని అనుభూతి' అని చెప్పారు.

వినోదంతో పాటు ఆలోచింపజేస్తుంది

- రామాంజనేయులు జవ్వాజి



"భద్రకాళి' లాంటి పొలిటికల్ థ్రిల్లర్ ఇప్పటివరకూ రాలేదు. ఈ సినిమాలో మంచి వినోదంతో పాటు ప్రేక్షకులను ఆలోచింపజేసే అంశాలూ ఉన్నాయి. ఇందులో విజయ్ ఆంటోనీ పాత్ర చిత్రణ నవ్యపంథాలో ఉంటుంది' అని నిర్మాత రామాంజనేయులు జవ్వాజి అన్నారు. విజయ్ ఆంటోని కథానాయకుడిగా అరుణ్ ప్రభు దర్శకత్వం వహించిన చిత్రమిది. సర్వంత్‌రామ్ క్రియేషన్స్ బేనర్‌పై రామాంజనేయులు నిర్మించారు. ఈ నెల 19న ఈ చిత్రం విడుదలవుతోన్న సందర్భంగా ఆయన మీడియాతో ముచ్చటించారు.

- విజయ్ ఆంటోనీతో కలసి వరుస చిత్రాలు ప్లాన్ చేశాం. మా కాంబినేషన్‌లో వచ్చిన 'మార్గన్' చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. దానికి మించిన విజయాన్ని ఈ సినిమా అందుకుంటుందని భావిస్తున్నాం. అరుణ్ ప్రభు చెప్పిన లైన్ ఆకట్టుకుంది. ఆయన విజన్ వల్లే సినిమా బాగా వచ్చింది. సమకాలీన సమాజంలో చర్చనీయాంశంగా మారిన ఓ ముఖ్యమైన పాయింట్‌ను తీసుకొని ఆయన కథ రాసుకున్నారు. వాణిజ్య అంశాలకి, సామాజిక అంశాలను కలిపి సినిమా తీయడంలో ఆయనకు ఆయనే సాటి. సినిమా మొదలైన రెండు నిమిషాల్లోనే ప్రేక్షకులు కథలో లీనమైపోతారు. ఆరంభం నుంచి ముగింపు వరకూ ఎక్కడా బోర్ కొట్టదు. ప్రతి సన్నివేశం మనసులో నిలిచిపోయేలా ఉంటుంది.
- 'భద్రకాళి' విజయ్ ఆంటోనికి 25వ సినిమా. మంచి బడ్జెట్‌తో అన్ని హంగులతో తెరకెక్కించాం. విజయ్ పాత్ర సహజత్వానికి దగ్గరగా ఉంటుంది. ప్రస్తుతం తమిళం, మలయాళంలోనూ మా బేనర్‌పై సినిమాలు చేస్తున్నాం. తెలుగులో సత్యదేవ్‌తో 'ఫుల్ బాటిల్', తమిళంలో 'బిచ్చగాడు' దర్శకుడు శశితో విజయ్ ఆంటోని హీరోగా ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నాను.

సినిమా విడుదలకు అనుమతివ్వలేదు



పాకిస్థాన్ నటుడు ఫవాద్ ఖాన్, బాలీవుడ్ నటి వాణి కపూర్ ప్రధాన పాత్రధారులుగా నటించిన చిత్రం 'అబీర్ గులాల్'. అయితే ఈనెల 26న సినిమా ఇండియాలో విడుదల కానున్నదనే వార్తలు కొద్ది రోజులుగా బీటౌన్‌లో హల్‌చల్ చేస్తున్నాయి. తాజాగా ఈ వార్తలు అవాస్తవమని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో(పీఐబీ) పేర్కొంది. ఈ సినిమా విడుదలకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేసింది. నిజానికి సినిమా ఈ ఏడాది మే 9న ఇండియాలో విడుదల కావాల్సి ఉంది. అయితే ఏప్రిల్ 22న పెహెల్గాంలో జరిగిన ఉగ్రదాడి అనంతరం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో విడుదల నిలిచిపోయింది. కాగా, భారతదేశం మినహా ప్రపంచ వ్యాప్తంగా ఈనెల 12న సినిమా విడుదలైంది.

కదిలించే సన్నివేశాలతో...



బి గణేశ్, బద్దెల శ్రీనివాస్, నవ్యశ్రీ ప్రధాన పాత్రధారులుగా బీకేఎస్ తెరకెక్కిస్తున్న చిత్రం 'ప్రేమతో దెయ్యం'. బి కుమారస్వామి నిర్మించారు. తాజాగా చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ 'ఇదో విభిన్న తరహా చిత్రం. ఇందులోని సన్నివేశాలు ప్రేక్షకులను కదిలించేలా ఉంటాయి' అని అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: డీఆర్ శ్యామ్‌కుమార్, సినిమాటోగ్రాఫర్: శేఖర్, సంగీతం: సీహెచ్ అమ్మ పాండు.

ఆద్యంతం ఉత్కంఠభరితం



సూపర్ రాజా కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రానికి 'ఇలాంటి సినిమా మీరెప్పుడూ చూసుండరు' అనే టైటిల్‌ను ఖరారు చేసి, ఈ నెల 19న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ సందర్భంగా చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో సూపర్‌రాజా మాటాడుతూ 'సహజత్వానికి దగ్గరగా ఉండే కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాను. ప్రతి ఒక్కరి జీవితానికి దగ్గరగా ఉంటుంది. ఇప్పటివరకూ తెలుగులో రాని విభిన్న కథ, కథనాలతో సినిమాను రూపొందించాం. థ్రిల్లింగ్ అంశాలతో ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతుంది' అని చెప్పారు.

ఆ టైటిల్ మాకే సొంతం



'అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ' పేరుతో వీఎస్ఆర్ ఫిల్మ్స్ సంస్థ బయోపిక్‌ను నిర్మిస్తోంది. దీనికి అచ్చర్ల రాజుబాబు దర్శకత్వం వహిస్తున్నారు ఏఆర్‌బీ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. త్వరలో రెగ్యులర్ షూటింగ్‌ని కూడా ప్రారంభించబోతున్నారు. ప్రస్తుతం నటీనటులు, సాంకేతిక నిపుణుల ఎంపిక జరుగుతోంది. 'అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ' టైటిల్ హక్కులు తమకే సొంతమని, ఫిల్మ్ ఛాంబర్‌లో రిజిస్టర్ చేయించామని వీఎస్ఆర్ ఫిల్మ్స్ సంస్థ పేర్కొంది. మరోవైపు ఎలాంటి టైటిల్ రిజిస్ట్రేషన్ లేకుండానే 'ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ' పేరుతో రవి నారాయణ్ దర్శకత్వంలో ఉషారాణి మూవీస్ బేనర్‌పై వల్లూరి రాంబాబు నిర్మిస్తున్నారని వీఎస్ఆర్ ఫిల్మ్స్ ఆరోపించింది. 'రవి నారాయణ్ గతేడాది టైటిల్ ఇవ్వమని అడిగారు. మేము ఇవ్వడం కుదరదు అని తేల్చి చెప్పాం. అయినా కూడా మా అనుమతి లేకుండానే సినిమా షూటింగ్ చేస్తున్నారు. చట్టపరంగా వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటాం' అని వీఎస్ఆర్ ఫిల్మ్స్ సంస్థ తెలిపింది.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

టీడీపీ మండల అధ్యక్షుడిగా మండవ నరసింహారావు

ఫిరంగిపురం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడిగా మండవ నరసింహారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం గుంటూరు జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన ఎన్నికలో మండవ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని కండ్రిక గ్రామానికి చెందిన నరసింహారావు మండల అధ్యక్షుడిగా రెండో పర్యాయం ఎన్నికయ్యారు. మండల ప్రధాన కార్యదర్శి బందనాథం సతీశ్, మండల ఉపాధ్యక్షుడిగా వడ్లమూడి రమేశ్, ఫిరంగిపురం టౌన్ అధ్యక్షుడిగా కటికల అప్పారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌కు మండల నాయకులు, కార్యకర్తలకు మండవ నరసింహారావు కృతజ్ఞతలు తెలిపారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి

● మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్



కిరణ్‌చంద్‌ను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

మంగళగిరి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ సహకారంతో మంగళగిరి మార్కెట్ యార్డులో సౌకర్యాలను మెరుగుపరిచి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని మంగళగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్ తెలిపారు. ఏఎంసీ చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కిరణ్‌చంద్‌ను రేవేంద్రపాడు జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భావన శ్రీనివాసరావు, దుర్గారావు, లింగినేని శివయ్య, అప్పారావు, హైమావతి, భవానీ, వనకుమారి, కపరపు శ్రీను, రాజారావు, పేరయ్య శాస్త్రీ, ముసునూరి సుదర్శన్, శరత్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పిడుగుపాటు కుటుంబాలకు టీడీపీ ఆర్థిక సాయం



మృతుల కుటుంబసభ్యులకు నగదు అందజేస్తున్న టీడీపీ నాయకులు

పెదనందిపాడు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు మృతి చెందిన వ్యవసాయ కూలీల కుటుంబాలకు టీడీపీ ఆర్థిక సాయం అందజేసింది. మండల పరిధిలోని అన్నవర్రు గ్రామంలో శనివారం పిడుగుపాటుకు మృతి చెందిన దేవరపల్లి సామ్రాజ్యం, తన్నీరు నాగమ్మ కుటుంబాలను ఆదివారం ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ఫోన్‌లో పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని టీడీపీ నాయకుల ద్వారా అందించారు. రైతు కూలీల కుటుంబాలను అన్ని విధాల ప్రభుత్వం ఆదుకుంటుందని రామాంజనేయులు భరోసా ఇచ్చారు.

స్వచ్ఛ దుగ్గిరాల, పార్కుల అభివృద్ధికి సహకరిస్తాం

● కాంటినెంటల్ కాఫీ ఇండియా చైర్మన్ రాజేంద్రప్రసాద్

దుగ్గిరాల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలో ప్లాస్టిక్ నియంత్రణ, పార్కుల అభివృద్ధికి సహకరిస్తామని కాంటినెంటల్ కాఫీ ఇండియా లిమిటెడ్ చైర్మన్ చల్లా రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. ఇటీవల విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్‌చే జీవిత సాఫల్య పురస్కారం అందుకున్న రాజేంద్రప్రసాద్‌ను దోస్త్ అధ్యక్షుడు మిక్కిలినేని గాంధీ, గద్దె శ్రీనివాస్, పంచాయతీ ఈఓ సీహెచ్ వివేకానంద ఘనంగా సత్కరించారు. గ్రామాభివృద్ధికి సహకారం అందిస్తామని హామీ ఇచ్చినందుకు గద్దె శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

పశ్చిమడెల్టాకు 5,009 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టాకు ఆదివారం 5,009 క్యూసెక్కు నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం బ్యారేజి వద్ద 12 అడుగుల నీటి మట్టం ఉండగా దిగువకు 2,57,250 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

కొండవీటి మేజరు కాలువకు ఐదు గండ్లు



కొండవీటి మేజరుకు గండి పడ్డ దృశ్యం

ఫిరంగిపురం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములూరిపాడు గ్రామం నుంచి యడ్లపాడు మండలం వంకాయలపాడు వరకు వెళ్ళే కొండవీటి మేజరు కాలువకు ఐదు చోట్ల గండ్లు పడ్డాయని డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ ఆరే పున్నారెడ్డి ఆదివారం తెలిపారు. వేములూరిపాడు వద్ద ఎర్రవాగు కలిసే స్థలం వద్ద, కోనేరు పాత పైపులైన్ వద్ద, అమీనాబాద్ అండర్ గ్రౌండ్ సైఫన్ వద్ద, హౌస్‌గణేష్ గ్రామం దాటాక గండ్లు పడ్డాయన్నారు. ఐతే అండర్ గ్రౌండ్ సైఫన్ వద్ద కాలువ నీరు, వర్షపు నీరు కలవటంతో వరద ఉధృతమై సైఫన్ పూర్తిగా వరదలో కొట్టుకుపోయిందని ఆయన తెలిపారు.

ఎస్సీ కాలనీలోకి కొండవీటి మేజరు కాలువ నీరు

కొండవీటి మేజరు కాలువకు గండ్లు పండి నీరంతా పొలాలగుండా ఫిరంగిపురంలోని ఎస్సీ కాలనీకి చేరింది. శనివారం రాత్రి 12 గంటల సమయంలో కాలనీని వరద ముంచెత్తగా కాలనీ వాసులు, రైతులు, స్థానికులు జేసీబీని తెచ్చి పక్కనే రహదారికి గండి కొట్టించి వరద నీటిని వాగులోకి మళ్లించారు. దీంతో కాలనీ వాసులు ఊపిరి పీల్చుకున్నారు.

రెండో రోజూ కొనసాగిన వర్షం

● ప్రజలకు తప్పని ఇబ్బందులు



అధ్వానంగా కేఆర్‌కొండూరు రోడ్డు

దుగ్గిరాల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లు జలమయమై వాహనదారులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. దుగ్గిరాలలోని పలురోడ్లు జలమయయ్యాయి. దుగ్గిరాల సబ్‌స్టేషన్, యార్డు ఆవరణ పూర్తిగా వర్షపునీటితో నిండిపోయింది. మంచికలపూడి.. కేఆర్ కొండూరు రోడ్డు వర్షానికి అధ్వానంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చిలువూరు, కేఆర్‌కొండూరు పరిసరాల్లోని సపోటా, జామతోటలు మునిగిపోయాయి.



తాడికొండలో పంట పొలాల్లోకి చేరిన వర్షం నీరు

● తాడికొండ(ఆంధ్రజ్యోతి): తాడికొండలో ఆదివారం భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాల్లో, పంట పొలాల్లో నీరు చేరింది. మేడికొండూరు, ఫిరంగిపురం మండలాల్లో కురిసిన భారీ వర్షాలకు కొండవీటి వాగుకు వరద నీరు భారీగా చేరుకుంది. లాం చప్టాను తాకుతూ ఈ వాగు ప్రవహిస్తోంది. ఎస్సీ బీసీ కాలనీల్లో రోడ్లు బురదమయమయ్యాయి.

సేవా పక్వాడాకు మండల టీమ్ ఎంపిక

ఫిరంగిపురం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): భారత ప్రధాని నరేంద్రమోదీ 75వ జన్మదినోత్సవం సందర్భంగా బీజేపీ పిలుపు మేరకు సేవా పక్వాడా పేరుతో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించినట్లు బీజేపీ జిల్లా కోశాధికారి వెంకటరమణ తెలిపారు. ఫిరంగిపురంలో ఆదివారం బీజేపీ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. సేవా పక్వాడాకు మండల కమిటీని ఎంపిక చేశామని తెలిపారు. స్వచ్ఛభారత్ సేవా కార్యక్రమానికి తిప్పారెడ్డి కాశీ విశ్వనాథ్‌రెడ్డి, మెడికల్ క్యాంపులకు మూల్పూరి మనోరంజన్ రెడ్డి, రక్తదాన శిబిరాలకు చదలవాడ శ్రీనివాసరావు, క్షీరాభిషేక కార్యక్రమాలకు మేరువ లక్ష్మారెడ్డిని ఎంపిక చేసినట్లు వెల్లడించారు.

కేఎల్‌యూలో ముగిసిన స్కిల్ పలావర్

తాడేపల్లి (వడ్డేశ్వరం), సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీలో స్కిల్ పలావర్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బీటెక్ విద్యార్థులకు పరిశ్రమ గురించి పూర్తి అవగాహన కల్పించి వారిని ఉద్యోగులుగా సంసిద్ధపరిచేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో మూడు దశల్లో ఈ కార్యక్రమం జరిగింది. కేర్‌లోన్ గ్లోబల్ సొల్యూషన్స్ ప్రతినిధి వెంకటకృష్ణారెడ్డి, అమ్మిరెడ్డి, ఎల్‌టీఐ మైండ్ ట్రీ నుంచి రామ్‌సాగర్, మొజిల్లా ఇండియా నుంచి కళ్యాణ్ దీక్షిత్, కేఎల్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్, వివిధ విభాగాల అధిపతులు, వీసీ సారధివర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నారైలో బయోకెమిస్ట్రీ సీఎంఈ

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం చినకాకాని ఎన్నారై వైద్య కళాశాలలో ఆదివారం బయోకెమిస్ట్రీ సీఎంఈ జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రబోధ్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో.. మారుతున్న జీవన పరిస్థితుల కారణంగా తలెత్తే ఆరోగ్య సమస్యలను గుర్తించడం, ముఖ్యంగా చిన్నపిల్లల్లో వచ్చే సమస్యలను ముందుగానే గుర్తించే పరీక్షలను గురించి చర్చించారు. ఈ సదస్సులో వైద్యులు మంతోష్ చక్రవర్తి, శైలజ ఆలపాటి, విజయకుమారి, దేశాయ్ విద్య, ఎన్నారై, ఎయిమ్స్ బయోకెమిస్ట్రీ వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొండపాటూరు పోలేరమ్మకి వడ్రాణం హరిబాబు ప్రత్యేక పూజలు



పోలేరమ్మ ఆలయం వద్ద వడ్రాణం హరిబాబు, తదితరులు

కాకుమాను, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొండపాటూరు స్వయంభు శ్రీ పోలేరమ్మ అమ్మవారికి డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఆలయానికి విచ్చేసిన హరిబాబుకు ఆలయ కార్యనిర్వాహక అధికారి జక్కా శ్రీనివాస్, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి ఆలయ విశిష్టతను ఆయనకు వివరించారు. ఆలయం వద్ద అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఆములోతు సాంబశివరావుతో కలిసి భక్తులకు హరిబాబు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జనసేన గుంటూరు జిల్లా ప్రధానకార్యదర్శి ఉప్పు వెంకట రత్తయ్య, భూ లక్ష్మీ, శ్రీను, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

చేనేత రంగానికి ప్రభుత్వ తోడ్పాటు అభినందనీయం

తాడేపల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): చేనేత రంగానికి ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటు అభినందనీయమని పద్మశాలి ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు స్వర్గం పుల్లారావు పేర్కొన్నారు. తాడేపల్లి మండలం కొలనుకొండ వద్ద నిర్మితమవుతున్న పద్మశాలి భవన్ వద్ద ఆదివారం అసోసియేషన్ కేంద్ర కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో సభ్యులు పలు తీర్మానాలను ఆమోదించారు. రాష్ట్రంలో చేనేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, 93 వేల మంది చేనేత కార్మికులకు ఏటా రూ.25 వేల చొప్పున నేతన్న భరోసా ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయమని అన్నారు. ఈ సమావేశంలో పద్మశాలి ఇంటర్నేషనల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విన్నకోట వెంకటేశ్వర్లు (కన్నా మాస్టారు), కోశాధికారి నీలి కనకదుర్గాప్రసాద్, సహాయ కార్యదర్శి పంచుమర్తి ప్రసాద్, మంగళగిరి శాఖ ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు, మురుగుడు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాలకు వెన్నుదన్నుగా కూటమి : దానబోయిన



ఇబ్రహీంను సత్కరించిన సుందరరావు యాదవ్, తదితరులు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు వెన్నుదన్నుగా నిలుస్తోందని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు యాదవ్ అన్నారు. ఏపీ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన మహమ్మద్ ఇబ్రహీంను టీడీపీ నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దానబోయిన మాట్లాడుతూ ఇబ్రహీం తెలుగుదేశం ఆవిర్భావం నుంచి పార్టీ కోసం విస్తృత సేవలు అందించారని చెప్పారు. ఆయన సేవలను గుర్తించిన సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ రాష్ట్ర స్థాయి డైరెక్టర్ పదవిని ఇచ్చి గౌరవించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రుద్రు శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, మురళీ, తోట శ్రీనుబాబు, కొల్లి వెంకట్రావు, రుద్రు నాగరాజు, కొత్తా శ్రీనివాసరావు, చింకా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జయభేరిలో ఆంధ్రా క్వెస్ట్ ఫర్ ఒలింపిక్ గోల్డ్ సమావేశం

తాడేపల్లి (కొలనుకొండ), సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం కొలనుకొండలోని జయభేరి అపార్ట్‌మెంట్ సముదాయంలో ఆదివారం ఆంధ్రా క్వెస్ట్ ఫర్ ఒలింపిక్ గోల్డ్ సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు, మాజీ క్రీడాకారులు క్రీడాభారతి సభ్యులు ఇస్కా స్పోర్ట్స్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇస్కా స్పోర్ట్స్ ఫౌండర్ సునీల్ మాట్లాడుతూ, 2036 ఒలింపిక్స్‌లో ఆంధ్రా క్రీడాకారులు పతకాలు సాధించే లక్ష్యంతో.. క్రీడాభారతి, ప్రభుత్వ సహకారంతో కొన్ని క్రీడలను దత్తత తీసుకొని ప్రైవేటు విభాగాలతో కలిసి క్రీడాకారులను తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో క్రీడాభారతి జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్ జగుదర్, ఇస్కా స్పోర్ట్స్ ఫౌండేషన్ సునీల్, క్రీడాభారతి స్టేట్ ప్రెసిడెంట్ ధనుంజయరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

బాలికపై అత్యాచారం

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం జరిగిన సంఘటన పొన్నూరులో జరిగింది. విశ్వసనీయ సమాచారం మేరకు బాపట్ల జిల్లాకు చెందిన ఓ బాలిక పొన్నూరు పట్టణంలోని ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తోంది. ఇటీవల బాలిక అనారోగ్యానికి గురికాగా కుటుంబసభ్యులు వైద్య పరీక్షలు చేయించగా గర్భం దాల్చినట్లు గుర్తించారు. బాపట్ల పోలీసులు ఈ సంఘటనపై జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి పొన్నూరు రూరల్‌కు కేసును బదిలీ చేశారు. దీనిపై పొన్నూరు రూరల్ పోలీసులు, తెనాలి డీఎస్పీ జనార్దనరావు ఆదివారం విచారణ జరిపినట్లు సమాచారం. దీనిపై పోక్సో, అట్రాసిటీ చట్టాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

ఆలయాల్లో ఆంజనేయ ధ్యానమండలి సేవలు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మూడు ఆలయాలలో ఆంజనేయ ధ్యాన యోగ మండలి సభ్యులు ఆదివారం సేవలు అందించారు. శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం, రమాసహిత సత్యనారాయణస్వామి ఆలయం, గీతా మందిరాల ఆవరణలను శుభ్రంచేసి స్వామి అమ్మవార్ల సేవకు వినియోగించే పరికరాలను శుభ్రం చేశారు.

నేటి నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయాలు: ఏడీఈ

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణ మండల పరిధిలో నేటి నుంచి ఈ నెల 23వ తేదీ వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉండవచ్చని విద్యుత్ శాఖ ఏడీఈ ఆర్ వెంకటేశ్వరరావు ఆదివారం తెలిపారు. పత్తిపాడు నుంచి పొన్నూరు వైపు వచ్చే విద్యుత్ లైన్లో మరమ్మత్తుల, 220/130 సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడవచ్చని ఏడీఈ తెలిపారు.

పాస్టర్లకు బియ్యం పంపిణీ

తెనాలి అర్బన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ది తెనాలి టౌన్ పాస్టర్స్ గ్రేట్ సపోర్ట్ అండ్ ఫుల్ హెల్పింగ్ అసోసియేషన్ సమావేశం ఆదివారం ఇస్లాంపేట యేసయ్య ప్రార్థన కొండ చర్చిలో నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు బ్రదర్ ఆనందన్న పాస్టర్ల కుటుంబాలకు 26కిలోల బియ్యం బస్తాలను పంపిణీ చేశారు.

వాకర్స్ క్లబ్ సమావేశం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెంచుపేటలో వాకర్స్ క్లబ్-2 సమావేశం ఆదివారం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు వేజళ్ల ఉమామహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈఎన్‌టీ వైద్యుడు భానుప్రసాద్ ప్రసంగించారు. ఆనందరావు, భుజంగరావు, రమాదేవి, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నూతన పీఏసీఎస్ సభ్యులు

చేబ్రోలు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వేజండ్లలో నూతనంగా ఎన్నికయిన పీఏసీఎస్ సభ్యులు ఆదివారం పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. చైర్మన్ షేక్ రియాజ్ అలీ, డైరెక్టర్లు చందు శ్రీరాములు, తోట శివమణికంఠ ఎమ్మెల్యేను కలిసి నూతన కమిటీలో తమకు అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. రైతులను సమన్వయం చేసుకుంటూ సొసైటీ బలోపేతానికి కృషి చేయాలని నరేంద్ర కుమార్ వారికి సూచించారు.

వర్షపు నీటిలో పంట పొలాలు

● ఆందోళనలో రైతన్నలు


కొల్లిపర, దావులూరిపాలెం సమీపంలో వర్షపు నీటిలో ఉన్న అరటి, కంద

కొల్లిపర, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో శని, ఆదివారం కురిసిన భారీ వర్షాలతో మెట్ట భూముల్లో వేసిన అరటి, పసుపు, కంద, మినుము, జామ, కూరగాయల తోటలు నీటిలో తేలియాడుతున్నాయి. పల్లపు ప్రాంతాల్లో వేసిన మినుము పంట పొలాలు వర్షపు నీటితో పూర్తిగా మునిగి పోవడంతో సముద్రాన్ని తలపిస్తున్నాయి. ముంపునకు గురైన పసుపు, అరటి, కంద, జామ, కూరగాయ తోటలు వర్షపు నీటి నుంచి బయట పడకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. మండలంలో దావులూరిపాలెం, కొల్లిపర, కొత్తబొమ్మువానిపలెం, గుడిబండివారిపాలెం తదితర గ్రామాల్లో వర్షపు నీటి నుంచి పొలాలు బయట పడకపోవడంతో పంటలు ఎక్కడ దెబ్బతింటాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కొల్లిపరలో 125.6 మిల్లీమీటర్ల వర్షపాతం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తెనాలి డివిజన్‌లోని పలు మండలాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. కొల్లిపరలో అత్యధికంగా 125.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, దుగ్గిరాలలో 98.8 మి.మీలు, తాడేపల్లిలో 43.4 మి.మీలు, తెనాలిలో 42.4 మి.మీలు, చేబ్రోలులో 30 మి.మీలు, మంగళగిరిలో 17.2 మి.మీలు, పొన్నూరులో 11.6 మి.మీలు, కాకుమానులో 8.2 మి.మీల వర్షపాతం నమోదయిందని సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారులు తెలిపారు.

ప్రధాన రహదారులు జలమయం

పెదకాకాని, సెప్టెంబర్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో వెనిగండ్ల, అగతొరపాడు గ్రామాల్లోని ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. రహదారులపై వర్షపు నీరు భారీగా చేరడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో సుందరయ్య కాలనీ, ఏపీఎన్ కాలనీ, అవతరపాడులోని ప్రధాన రహదారులు చెరువులను తలపిస్తున్నాయి.


వెనిగండ్ల సుందరయ్య కాలనీ ప్రధాన రోడ్డుపై ఉన్న వర్షపు నీరు

విషజ్వరాలపై భయాందోళనలు వద్దు

జిల్లా వైద్యాధికారి డాక్టర్ విజయలక్ష్మి


వైద్యులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా వైద్యాధికారి కే.విజయలక్ష్మి

చేబ్రోలు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) చేబ్రోలు మండలంలోని కొత్తరెడ్డిపాలెంలో జ్వరాలు తగ్గిపోయాయని గ్రామస్థులు భయపడాల్సిన అవసరం లేదని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కే.విజయలక్ష్మి అన్నారు. ఆదివారం కొత్తరెడ్డిపాలెంలోని ఆరోగ్య ఉపకేంద్రాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ కే.విజయలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కే.విజయలక్ష్మి స్థానిక వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కే.విజయలక్ష్మి మాట్లాడుతూ కొత్తరెడ్డిపాలెంలోని జ్వరాలు అధికంగా ఉన్నాయని తెలిసి ఇంటింటి సర్వే నిర్వహించిన తరువాత మెడికల్ క్యాంప్ పెట్టామన్నారు. సెప్టెంబరు 4 నుంచి గ్రామంలో 20 కేసులు వచ్చి తగ్గాయన్నారు. 9మందికి వ్యాధి లక్షణాలు ఉంటే వారి నుంచి శాంపిల్స్ తీయడం జరిగిందని, అందులో కూడా నాలుగు నెగటివ్ వచ్చాయి. మిగిలిన వారికి వచ్చిన వ్యాధి లక్షణాలు ప్రమాదకరమైనవి కావన్నారు. ప్రజలు ఎటువంటి భయాందోళన చెందవద్దని వైద్య సిబ్బంది, వైద్యులు అందుబాటులో ఉన్నారని తెలిపారు. ప్రజలకు ఎటువంటి సహాయ సహకారం కావాలన్నా నేరుగా వైద్య సిబ్బందిని సంప్రదించి వాళ్ళ సలహాతోనే మందులు వాడాలన్నారు. అవసరం అనుకుంటే మెడికల్ క్యాంపు కొనసాగిస్తామన్నారు. మెలియాయిడోసిస్ అనుమాన లక్షణాలు ఉన్న వారికి రక్త నమూనాలను సేకరించి పరీక్షలకు పంపించగా అటువంటి వ్యాధి లక్షణాలు లేవని తెలిపారు. చల్లా సీతారామరెడ్డి అనే వ్యక్తి ఒక ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ చనిపోవడం, దానికి మెలియాయిడోసిస్ వ్యాధి కారణమని అబద్ధపు ప్రచారం జరిగాయన్నారు. చల్లా సీతారామరెడ్డి మెడికల్ వైద్యనివేదికను సంబంధిత హాస్పిటల్ నుంచి తెప్పించానని దానిలో మెలియాయిడోసిస్ కారణం అని రాసిలేదని ఆర్గాన్స్ ఫెయిల్యూర్ వలన చనిపోయి ఉన్నట్లు ఉందని వివరించారు. అనంతరం జ్వరంతో బాధపడుతున్న చిన్నారి ఇంటికి వెళ్లి అందిన వైద్యసేవల గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో చేబ్రోలు వైద్యాధికారులు డాక్టర్ ఊర్మిళ, డాక్టర్ శైలజ, ఈవోపీఆర్డీ రవిశంకర్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, స్థానికులు పాల్గొన్నారు.

సీనియర్ న్యాయవాది రాఘవయ్యకు సన్మానం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సీనియర్ న్యాయవాది వెలినేని రాఘవయ్య, పద్మజారాణి దంపతులను ఆదివారం ఘనంగా సన్మానించారు. పోక్సో కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన సందర్భంగా కాకతీయ సొసైటీలో జరిగిన కార్యక్రమంలో ఆయన అందిస్తున్న సేవలను గౌరవ అధ్యక్షుడు డీఎల్ కాంతారావు అభినందించారు. చైర్మన్ దావులూరి చక్రధర్, జీడీసీసీ మాజీ చైర్మన్ మారౌతు సీతారామయ్య, కార్యదర్శి ఝాన్సీ వాసుదేవనాయుడు, నందకిషోర్, రామాచార్యులు, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

తెనాలిలో మొబైల్ టెక్నీషియన్ అసోసియేషన్ సమావేశం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మొబైల్ ఫోన్ టెక్నీషియన్ అసోసియేషన్ సమావేశం ఆదివారం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు జాని సభ్యులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు చెర్రీ, కార్యదర్శి సంపత్, సంయుక్త కార్యదర్శి కిషోర్, రాజు, సాయిమణి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.


రైతులకు సోలార్ లైట్ ట్రాప్‌లను పంపిణీ చేస్తున్న డాక్టర్ సాంబిరెడ్డి

రైతులకు సోలార్ లైట్ ట్రాప్‌ల పంపిణీ

కొల్లిపర, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపర విశ్వశాంతి హైస్కూల్‌లో రైతులకు మిత్రమండలి సభ్యులతో కలిసి గౌరవ అధ్యక్షుడు డాక్టర్ భీమవరపు సాంబిరెడ్డి ఉచితంగా సోలార్ లైట్ ట్రాప్‌లను ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రేష్ట డెరెక్టర్ ఉయ్యూరు సాంబిరెడ్డి, మిత్ర మండలి సభ్యులు ఎ.కుటుంబరెడ్డి, బి.పోతిరెడ్డి, ఎ.కోటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జనసేన క్రియాశీల సభ్యులకు బీమా సాయం


పార్టీ క్రియాశీలక సభ్యురాలికి నివాళులర్పిస్తున్న మంత్రి మనోహర్

తెనాలి అర్బన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మరణించిన జనసేన క్రియాశీలక సభ్యులకు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ బీమా సాయం అందజేశారు. సుల్తానాబాద్‌లో కన్నెగంటి ఝాన్సీరాణి కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించి రూ.5లక్షల బీమా చెక్కును నాగార్జునకు అందజేశారు. ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఖాజీపేటకు చెందిన వరుణ్‌నాగ్ కుటుంబాన్ని పరామర్శించి రూ.5 లక్షల బీమా చెక్కును అందించారు. మంత్రితో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.


మృతులకు నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

● ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందిన తల్లీ, కుమార్తెల కుటుంబాలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ తెలిపారు. మండల పరిధిలోని జూపూడి గ్రామానికి చెందిన తల్లి, కుమార్తె, భాగ్యమ్మ, పిచ్చమ్మ విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందారన్న సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ మృతుల కుటుంబ సభ్యులను ఫోన్లో పరామర్శించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ నాయకులు జూపూడి గ్రామానికి వెళ్లి మృతదేహాలను సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు. నివాళులు అర్పించిన వారిలో ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాల వెంకటేశ్వరరావు, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బండ్లమూడి బాబురావు, సి.సీతరామయ్య, ఎ.విజయ్‌కుమార్, కె.రత్నమోహన్, కె.సూరిబాబు, బి.శేషగిరి, ఎం.రామకృష్ణ, ఎన్.సంసోను, బి.మరియదాసు, తదితరులు మృతులకు నివాళులర్పించారు.

ఒక డీఏనైనా ప్రకటించాలి: మంత్రి మనోహర్‌కు ఏపీటీఎఫ్ వినతి

తెనాలి అర్బన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన నాలుగు డీఏలలో దసరా పండుగకు ఒక్క డీఏ అయినా ప్రకటించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కోరారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన వారంలో భాగంగా ఆదివారం ఆయన మంత్రికి వినతిపత్రం అందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15నెలలయినా, ఇప్పటికీ పెండింగ్ బకాయిలు విడుదల చేయలేదన్నారు. 12వ పీఆర్సీ 2023 నుంచి అమలు చేయాల్సి ఉండగా కనీసం కమిషన్ చైర్మన్‌ను కూడా నియమించలేదన్నారు. మంత్రికి వినతిపత్రం అందజేసిన వారిలో జోన్ కన్వీనర్ పుట్టా జనార్దనరావు, ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఖలీద్, లక్ష్మణకుమార్, పద్మజ, పోతార్లంక శ్రీనివాస్, యోహాను, ఏసుబాబు పాల్గొన్నారు.

